News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 04 | సంచిక :340 | ఖమ్మం | మంగళవారం జనవరి 20, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## దోమలు కుట్టి జనం చావటం లేదా.. కుక్కలు కరిస్తేనే మాట్లాడతారా..?



- హైదరాబాద్‌లో రేణు దేశాయ్ ప్రెస్ మీట్
- రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని వెల్లడి
- వీధి కుక్కలను చంపేయడంపై తీవ్ర ఆగ్రహం
- ఒక కుక్క కరిస్తే వందల కుక్కలను చంపుతున్నారని మండిపాటు
- ఒక్క మగాడు అత్యాచారానికి పాల్పడితే అందరూ రేపిస్టులు అవుతారా అని నిలదీత

తనకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని ప్రముఖ సినీ నటి రేణు దేశాయ్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో ప్రముఖ యాంకర్ రష్మితో కలిసి ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయాల్లోకి వస్తారా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా ఆమె పై విధంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆమె వీధి కుక్కలను చంపడంపై తీవ్రంగా స్పందించారు.ఒక కుక్క కరిస్తే వందల కుక్కలను నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్నారని, మరి ఒక్క మగాడు అత్యాచారానికి పాల్పడితే అందరు మగాళ్లు రేపిస్టులు, హంతకులు అవుతారా? అని ఆమె ప్రశ్నించారు. కుక్క కాటు కారణంగా మనిషి చనిపోతే స్పందించే వ్యవస్థలు రోడ్డు ప్రమాదాలు, హత్యలు, అత్యాచారాలపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.సమాజంలో చిన్నారులపై అత్యాచారాలు జరిగినప్పుడు ఎవరూ స్పందించడం లేదని మండిపడ్డారు. ఇటీవల నిజామాబాద్ జిల్లాలో ఒక గ్రామ పంచాయతీ సర్పంచ్ వందల కుక్కలను చంపడమేమిటని ప్రశ్నించారు. కుక్క, ఆవు, గేదె, పిల్లి, కోతి ఇవన్నీ ప్రాణులు కాదా అని నిలదీశారు. వీధి కుక్కల సంఖ్య పెరగడానికి కారణం మన చుట్టూ ఉన్న అపరిశుభ్ర పరిస్థితులేనని వెల్లడించారు.కుక్కలు పెరగడానికి గల అపరిశుభ్ర పరిస్థితులపై ఎవరూ ఆలోచన చేయడం లేదని అన్నారు. నిద్ర లేచిన దగ్గరి నుంచి కాలభైరవుడిని పూజిస్తారని, మరోవైపు కుక్కలను చంపుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కరు అత్యాచారానికి పాల్పడితే మగవాళ్లందరినీ జైల్లో పెట్టడం లేదు కదా అన్నారు. తాను ఇంత గట్టిగా మాట్లాడినందుకు తనను జైల్లో పెట్టుకుంటే పెట్టుకోవచ్చని అన్నారు. వాహనాలు ఢీకొట్టడం వల్ల రోజుకు వందల సంఖ్యలో కుక్కలు గాయపడుతున్నాయని, అవి ఎవరి వద్దకు వెళ్లి ఫిర్యాదు

- మిగతా 2లో...



# మేడారంలో సీఎం పూజలు

- ఆదివాసీ సంప్రదాయంలో ఘన స్వాగతం
- మనవడితో కలిసి 68 కిలోల బంగారం తులాభారం

- పైలాన్ ను అవిష్కరించిన ముఖ్యమంత్రి
- అభిమానులకు కరచాలనం చేస్తూ మున్ముందుకు..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయం మేడారం సమ్మక్క, సారలమ్మ ను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గద్దెల వద్దకు చేరుకున్న సీఎంకు ఆదివాసీ డప్పు వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారుఈ క్రమంలో ఆయన మేడారంలో గద్దెలు, ఆలయ

- మిగతా 2లో...

## దావోస్ కు బయల్దేరిన రేవంత్ రెడ్డి



- దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొననున్న రేవంత్
- పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా దావోస్ పర్యటన
- వనదేవతల దర్శనం పూర్తి చేసుకుని స్విట్జర్లాండ్ పయనం

## బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవం..

- ఐదుసార్లు ఎమ్మెల్యే
- బీహార్ ప్రభుత్వంలో కీలక శాఖల నిర్వహణ
- పార్టీ సంస్థాగత నిర్మాణంలో కీ రోల్



నితిన్ నబీన్ ను ప్రతిపాదిస్తూ 37 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. వేరెవరూ పోటీకి నిలవలేదు. దీంతో నబీన్ అధ్యక్ష పదవి లాంఛనంగా మారింది. ఒకవేళ ఎవరైనా పోటీకి దిగితే రేపు ఎన్నికలు నిర్వహించేందుకు బీజేపీ నిర్ణయించింది. అయితే ఎవరూ అధ్యక్ష పదవికి పోటీలో నిలవకపోవడంతో బీజేపీ కొత్త దళపతిగా నబీన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. నబీన్ నేడు ఉదయం 11 గంటలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరు కానున్నారు.భారతీయ జనతా పార్టీ తన

- మిగతా 2లో...


## 270 ఏళ్ల తర్వాత పూర్తిస్థాయిలో కేరళ కుంభమేళా

- నీల నది తీరంలో మహా మాఘ మహోత్సవం ప్రారంభం
- ధర్మ ధ్వజాన్ని ఆవిష్కరించి ప్రారంభించిన గవర్నర్
- చివరిసారి 1755లో పూర్తిస్థాయి మహోత్సవం జరిగినట్లు రికార్డులు



కేరళలోని తిరునావాయలో నీల నది తీరంలో కేరళ కుంభమేళాగా పిలిచే మహా మాఘ మహోత్సవం ప్రారంభమైంది. ఈ మహోత్సవాన్ని రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ధర్మ ధ్వజాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ సనాతన సంప్రదాయాన్ని, హిందూ ఆచారాలను

- మిగతా 2లో...



## హరీశ్‌రావుకు సిట్ నోటీసులు

- నేడు విచారణకు రావాలని సూచన
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం
- జూబ్లీహిల్స్‌లోని పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలన్న సిట్
- ప్రస్తుతం సిద్దిపేట పర్యటనలో ఉన్న హరీశ్ రావు

ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో సోమవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, భారాస నాయకుడు హరీశ్‌రావుకు సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తమ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. హరీశ్‌రావు జిల్లా పర్యటనలో ఉండటంతో సిట్ సిబ్బంది నోటీసులను కోకాపేటలోని

- మిగతా 2లో...

## కొండెక్కిన వెండి.. పరుగాపని పసిడి

కిలో సిల్వర్ రూ.3.09 లక్షలు

3 నెలల్లోనే రెట్టింపయిన ధర

- మిగతా 2లో...



## కొత్త పార్టీ ఏర్పాటుపై వేగం పెంచిన కవిత

- కొత్త పార్టీ ఏర్పాటు దిశగా కవిత అడుగులు
- వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో వరుస సమావేశాలు
- తెలంగాణ జాగృతిని రాజకీయ శక్తిగా మారుస్తానని ప్రకటన
- మైనార్టీలు, బీసీలు, యువతకు తన పార్టీలో చేరాలని ఆహ్వానం



- మిగతా 2లో...



## భారత్, యూఏఈ మెగా రక్షణ బంధం

- 2 గంటల్లోపు పర్యటన కోసం వచ్చివెళ్లిన ఎమిరేట్స్ అధ్యక్షుడు
- యూఏఈ అధ్యక్షుడికి, ఆయన కుటుంబానికి అపురూపమైన కానుకలు ఇచ్చిన ప్రధాని మోదీ
- భారత్‌కు చేరుకున్న యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్
- విమానాశ్రయానికి వెళ్లి స్వయంగా స్వాగతించిన ప్రధాని మోదీ
- భారతీయ సంప్రదాయ ఉయ్యాలతో పాటు ప్రత్యేక కానుకల బహూకరణ
- "నా సోదరుడు" అంటూ సోషల్ మీడియాలో ప్రధాని మోదీ పోస్ట్
- ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు

- మిగతా 2లో...

# భారత్, యూఏఈ మెగా రక్షణ బంధం

దిల్లీ: మెగా వ్యూహాత్మక రక్షణ బంధం దిశగా భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అడుగులు వేశాయి. దీంతోపాటు ఎల్ఎన్‌జీ ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2032 నాటికి రెండు దేశాల మధ్య 200 బిలియన్ డాలర్ల వాణిజ్యం లక్ష్యంగా ముందుకు సాగాలని నిర్ణయించాయి. ప్రధాని మోదీతో సోమవారం దిల్లీలో యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారి మధ్య కీలక అంశాలపై చర్చలు జరిగాయి. కేవలం 2 గంటల్లోపు పర్యటన కోసం నహ్యాన్.. 4 గంటలు ప్రయాణించి దిల్లీ చేరుకున్నారు. విమానాశ్రయంవద్ద ఆయనకు ప్రధాని మోదీ స్వాగతం పలికారు. ఇద్దరూ ఆలింగనం చేసుకున్నారు. ఒకే వాహనంలో ప్రధాని ఇంటికి చేరుకున్నారు. ఏకాంతంగా, అధికారుల సమక్షంలో చర్చలు జరిపారు.

పాక్, సౌదీల మధ్య రక్షణ బంధం కుదిరిన నేపథ్యంలో యూఏఈతో భారత్ రక్షణ ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం.

ఇరాన్-అమెరికా మధ్య ఘర్షణ వాతావరణం, యెమెన్ విషయంలో సౌదీ, యూఏఈల మధ్య ఉద్రిక్తతలు, గాజాలో అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో యూఏఈ అధ్యక్షుడి పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ అంశాలపై అధినేతల మధ్య చర్చలు జరిగినట్లు విదేశీ వ్యవహారాలశాఖ కార్యదర్శి మిస్రీ తెలిపారు. భారత పర్యటనకు వచ్చిన యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఘన స్వాగతం పలికారు. ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి, ఢిల్లీ విమానాశ్రయానికి స్వయంగా వెళ్లి ఆయనను ఆత్మీయంగా ఆహ్వానించారు. అనంతరం ఇద్దరు నేతలు ఒకే కారులో ప్రయాణించడం వారి మధ్య ఉన్న బలమైన స్నేహబంధానికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా లోక్ కల్యాణ్ మార్గ్‌లోని తన నివాసంలో యూఏఈ అధ్యక్షుడికి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రధాని మోదీ భారతీయ సంస్కృతి, నైపుణ్యానికి ప్రతీకగా నిలిచే ప్రత్యేక కానుకలను అందజేశారు. గుజరాతీ కుటుంబాల్లో తరతరాలుగా బంధాలకు కేంద్రంగా ఉండే, చేతితో చెక్కిన అందమైన చెక్క ఉయ్యాల (ఝూలా)ను బహూకరించారు. యూఏఈ 2026ను 'కుటుంబ సంవత్సరం'గా ప్రకటించిన నేపథ్యంలో ఈ కానుకకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. దీంతో పాటు, కశ్మీర్‌కు చెందిన సుప్రసిద్ధ పష్మీనా శాలువాను తెలంగాణలో తయారైన వెండి పెట్టెలో పెట్టి అందజేశారు. "నా సోదరుడు, యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌కు స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వెళ్లాను. బలమైన భారత్-యూఏఈ స్నేహానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ పర్యటన తెలియజేస్తోంది" అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. యూఏఈ అధ్యక్షుడి తల్లి షేఖా ఫాతిమాకు కూడా పష్మీనా శాలువాతో పాటు, వెండి పెట్టెలో కశ్మీరీ కుంకుమపువ్వును బహూకరించారు.

ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన రంగాల్లో బలమైన సంబంధాలు ఉన్నాయి. ఈ పర్యటన ద్వారా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంతో పాటు, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చించనున్నారు. గత దశాబ్ద కాలంలో యూఏఈ అధ్యక్షుడు భారత్‌లో పర్యటించడం ఇది ఐదోసారి కావడం గమనార్హం.

# కొండెక్కిన వెండి.. పరుగాపని పసిడి

బంగారం, వెండి ధరలు చుక్కలను తాకుతున్నాయి. ధరల పెరుగుదలలో బంగారాన్ని మించి, వెండి దూసుకుపోతోంది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎక్స్ఛేంజీలతో పాటు విక్రయశాలల్లోనూ ఈ లోహాల ధరలు రికార్డు గరిష్ఠాలకు చేరుతున్నాయి. తొలిసారిగా దేశీయ విపణిలో కిలో వెండి ధర రూ.3 లక్షలను మించింది. ఇతర ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ కాస్త బలహీనపడటం, గ్రీన్‌లాండ్ స్వాధీనానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దూకుడుగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో.. సురక్షితమని భావిస్తూ బంగారం, వెండిపైకి పెట్టుబడులు రావడమే వీటి ధరలు గణనీయంగా పెరగడానికి కారణమని బులియన్ వర్తకులు చెబుతున్నారు. కొత్త ఇంధన రంగాలు, విద్యుత్తు వాహనాల తయారీ రంగాల నుంచి వెండికి గిరాకీ అంతకంతకూ పెరుగుతోంది.

అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో, హైదరాబాద్ బులియన్ విపణిలో సోమవారం రాత్రి 11.55 గంటలకు కిలో వెండి ధర రూ.3,09,700 వద్ద, 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.1,49,300 వద్ద స్థిరపడ్డాయి.

అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) మేలిమి బంగారం ధర 82 డాలర్లు పెరిగి, 4678 డాలర్లకు, ఔన్సు వెండి ధర 4.5 డాలర్లు అధికమై 94.62 డాలర్లకు చేరడం వల్లే దేశీయంగానూ ధరలు ఇంతలా పెరిగాయి.

**ఎంసీఎక్స్‌లో**

కమొడిటీల ట్రేడింగ్ జరిగే మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్)లో కిలో వెండి మార్చి కాంట్రాక్టు ధర రూ.3,05,000ను మించింది. 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.1,45,000 వద్ద ట్రేడ్ అవుతోంది.

ఇంతకుమించిన డిమాండ్ పెట్టుబడులు, పారిశ్రామిక రంగాల నుంచి వస్తోంది. కమొడిటీ ఎక్స్ఛేంజీల్లో పెట్టుబడులు పెట్టినా, డెలివరీ తీసుకునే వారు తక్కువ కనుక, పెద్దగా ఇబ్బంది ఉండదు. అయితే వెండి ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్)లలోకి వచ్చే పెట్టుబడులకు సమానంగా వెండిని ఆయా సంస్థలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వెండి ధర పెరుగుదల నేపథ్యంలో, వెండి ఫండ్‌ల్లోకి పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. అందుకు తగ్గట్టు కొనుగోలు చేయాల్సి వస్తోంది. అంతర్జాతీయంగా పెట్టుబడులు - పారిశ్రామిక రంగాల నుంచి వస్తున్న గిరాకీ కంటే 2,500 టన్నులు తక్కువగా వెండి ఉత్పత్తి అవుతోందని.. ఈ అంతరం మరింత పెరగొచ్చనే అంచనాలున్నాయి.

**బంగారం, వెండి తరవాతే అగ్రగామి కంపెనీలు**

బంగారం, వెండి ధరల దూకుడు ఫలితంగా, అంతర్జాతీయంగా అత్యధిక మార్కెట్ విలువ పరంగా అగ్రగామి కంపెనీలు కూడా వెనుకబడ్డాయి. ప్రపంచ స్వర్ణమండలి అంచనాల ప్రకారం అంతర్జాతీయంగా బంగారం నిల్వలు 2,16,225 టన్నులు, వెండి 17,51,000 టన్నులుగా పరిగణించి.. ప్రస్తుత ధరల ప్రకారం ఈ అంచనాలు ప్రకటిస్తున్నారు.

**20 రోజుల్లోనే.. రూ.70,000 పెరుగుదల**

ధరల పెరుగుదలలో వెండి దూకుడు కొనుగోలుదార్లకు ఆందోళన కలిగిస్తుండగా, పెట్టుబడిదార్లను మాత్రం ఆనందంలో ముంచెత్తుతోంది. ఈ నెలలోనే వెండి కిలో ధర రూ.2.40 లక్షల నుంచి రూ.3.09 లక్షలకు పైగా పెరిగింది. దీపావళి సమయంలో ధర బాగా పెరిగినా, పండగ తరవాత 2025 అక్టోబరు 27న కిలో వెండి ధర రూ.1.48 లక్షలకు దిగి వచ్చింది. తదుపరి మళ్లీ పెరుగుతూ వస్తోంది. 3 నెలలు కూడా గడవకముందే రెట్టింపునకు మించడం గమనార్హం.

# బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవం..

- మొదటి పేజి తరువాయి

అగ్ర సంస్థాగత నాయకత్వంలో మార్పును చూడబోతోంది. నితిన్ నబీన్ పార్టీ తదుపరి జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్నారు. 45 ఏళ్ల నబిన్ బీజేపీకి నాయకత్వం వహించే అతి పిన్న వయస్కుడైన నాయకుడిగా అవతరిస్తారు. జనవరి 2020 నుండి ఈ పదవిలో ఉన్న జేపీ నడ్డా తర్వాత ఆయన పదవిని చేపడతారు. బీజేపీ 12వ జాతీయ అధ్యక్షుడిగా జనవరి 20న ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

**నితిన్ నబిన్ ముందు కీలక సవాళ్లు..**

పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి వంటి రాష్ట్రాలలో కీలకమైన అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికార పార్టీ జాతీయ స్థాయిలో ఒక ప్రధాన సంస్థాగత పునర్నిర్మాణానికి సిద్ధమవుతున్న తరుణంలో నాయకత్వ మార్పు వస్తుంది. డీలిమిటేషన్, పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీలలో 33 శాతం మహిళా కోటా అమలు వంటి ముఖ్యమైన మార్పుల మధ్య జరగనున్న 2029 లోక్‌సభ ఎన్నికల వైపు పార్టీని నడిపించే బాధ్యత కూడా నబిన్‌పై ఉంది. నబిన్ మే 23, 1980న జార్ఖండ్‌లోని రాంచీలో జన్మించారు. ఆయన తండ్రి నబిన్ కిషోర్ ప్రసాద్ సిన్హా బీజేపీ సీనియర్ నాయకుడు. పాట్నా వెస్ట్ నుండి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పని చేశారు. నబిన్ తల్లి పేరు మీరా సిన్హా.

**నితిన్ నబిన్ విద్యాభ్యాసం- పాట్నా నుండి ఢిల్లీ వరకు..**

నబిన్ 1996లో టెన్త్ పాసయ్యారు. పాట్నాలోని జడీూజు అనుబంధ సెయింట్ మైఖేల్స్ హై స్కూల్ లో చదువుకున్నారు. ఆ తర్వాత ఢిల్లీలోని జూఖవీ పబ్లిక్ స్కూల్ లో చదువుకున్నారు. 1998లో ఇంటర్ పూర్తి చేశారు. దీప్ మాల శ్రీవాస్తవను నితిన్ వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. కుమారుడు, కుమార్తె.

**రాజకీయ నేపథ్యం..**

బీహార్ లోని బంకిపూర్ నియోజకవర్గం నుండి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2006లో పాట్నా వెస్ట్ నుండి ఉప ఎన్నికలో గెలిచి ఎన్నికల రాజకీయాల్లోకి ప్రవేశించారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత, ఆయన బంకిపూర్‌కు మారారు. అప్పటి నుండి 2010, 2015, 2020, 2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ స్థానాన్ని నిలుపుకున్నారు. 2025 ఎన్నికలలో నబిన్ నిర్ణయాత్మక విజయాన్ని సాధించారు. 98వేల 299 ఓట్లను సాధించి, రాష్ట్రీయ జనతాదళ్ అభ్యర్థి రేఖ కుమారిని 51వేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడించారు.

**బీహార్ ప్రభుత్వంలో కీలక శాఖలను నిర్వహించారు..**

నితీష్ కుమార్ నేతృత్వంలోని బీహార్ ప్రభుత్వంలో నబిన్ అనేక కీలక శాఖలను నిర్వహించారు. ఫిబ్రవరి 2021 నుండి ఆగస్టు 2022 వరకు రోడ్డు నిర్మాణ మంత్రిగా పని చేశారు. ఫిబ్రవరి 2025 నుండి డిసెంబర్ 2025 వరకు అదే శాఖకు తిరిగి వచ్చారు. మార్చి 2024 ఫిబ్రవరి 2025 మధ్య చట్టం న్యాయ మంత్రిత్వ శాఖతో పాటు పట్టణాభివృద్ధి గృహనిర్మాణ శాఖను కూడా నిర్వహించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ గృహనిర్మాణ కార్యక్రమాలు, సంక్షేమ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో జర్నలిస్టులకు మద్దతిచ్చే పథకాలు, ఆశా-మమతా కార్మికులకు ప్రోత్సాహకాలు ఉన్నాయి.

**బీజేపీలో మూలాలు..**

బీజేపీ యువజన విభాగం నుండి వచ్చిన నబిన్.. పార్టీ సంస్థాగత నిర్మాణంలో గణనీయమైన పాత్ర పోషించారు. గతంలో భారతీయ జనతా యువ మోర్చా (బిజెవైఎం) జాతీయ ప్రధాన కార్యదర్శిగా, బిజెవైఎం బీహార్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. యువత సమీకరణ ప్రచారాలలో చురుకుగా పాల్గొన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో జాతీయ ఐక్యతా యాత్ర, 1965 యుద్ధంలో అమరవీరులను గౌరవిస్తూ గౌహతి నుండి తవాంగ్‌కు జరిగిన కవాతుతులో పాల్గొన్నారు.

సిక్కింకు బిజెపి ఇన్‌చార్జ్‌గా, ఛత్తీస్‌గఢ్‌కు కో-ఇంచార్జ్‌గా సంస్థాగత బాధ్యతలు కూడా నిర్వహించారు. ఆ రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహణ, పార్టీ విస్తరణకు దోహదపడ్డారు. డిసెంబర్ 2025లో, బిజెపి పార్లమెంటరీ బోర్డు ఆయనను పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది.

# హరీశ్‌రావుకు సిట్ నోటీసులు

- మొదటి పేజి తరువాయి

ఆయన ఇంట్లో ఇచ్చి వెళ్లారు. దాదాపు రెండేళ్లుగా జరుగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా భారాస అగ్రనేతను విచారించేందుకు నోటీసు జారీ చేయడం ఇదే ప్రథమం. ఫోన్ ట్యాపింగ్ కేసు అనేక మలుపులు తిరుగుతున్న విషయం తెలిసిందే. భారాస అధికారంలో ఉన్నప్పుడు రాజకీయ నాయకులు, వ్యాపారులు మొదలు జడ్జీల ఫోన్లనూ ట్యాప్ చేశారని, వాటికి సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేశారన్న ఆరోపణలపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లో 2024 మార్చిలో కేసు నమోదైంది. అనంతరం జరిగిన పరిణామాల్లో ట్యాపింగ్ వ్యవహారంలో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ ఓఎస్డీగా పనిచేసిన ప్రభాకర్‌రావు విదేశాలకు పారిపోవడంతో దర్యాప్తునకు ఆటంకం ఏర్పడింది. మిగతా నిందితులను అరెస్టు చేసినప్పటికీ ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో చాలాకాలంపాటు దర్యాప్తు నిలిచిపోయింది. మళ్లీ గత జూన్‌లో ప్రభాకర్‌రావు హైదరాబాద్ రావడంతో దర్యాప్తు ఊపందుకుంది. ఇదే కేసులో మరో నిందితుడైన ఐన్యూస్ ఎండీ శ్రవణ్‌రావు కూడా అంతకుముందే విదేశాల నుంచి తిరిగివచ్చారు.

**ఫోన్ కాల్స్ ఆధారం**

దర్యాప్తులో భాగంగా.. సిట్ అధికారులు శ్రవణ్‌రావు, ప్రభాకర్‌రావులతోపాటు ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావులకు మధ్య ఫోన్ సంభాషణ జరిగినట్లు గుర్తించారు. శ్రవణ్‌రావును సిట్ అధికారులు విచారించినప్పుడు వారిద్దరితో ఎందుకు మాట్లాడారని అడిగినప్పుడు, ఒక ప్రైవేట్ వేడుకలో అప్పటి మంత్రి హరీశ్, ప్రభాకర్‌రావు కలుసుకున్నారని, ఆ సందర్భంగా వారిద్దరి మధ్య జరిగిన సంభాషణలో తమ ఛానల్(ఐన్యూస్) చేసిన ఎన్నికల సర్వే గురించి ప్రస్తావన వచ్చిందని చెప్పినట్లు తెలుస్తోంది. ఈ సర్వేలో భారాసకు తక్కువ సీట్లు వస్తున్నాయని చెబితే నిఘా విభాగం మాత్రం ఎక్కువ సీట్లు వస్తున్నాయని ఎలా చెబుతుందని ప్రభాకర్‌రావును హరీశ్ అడిగినట్లు, దీనికి సంబంధించి మరింత స్పష్టత కోసం తనతో మాట్లాడమని ప్రభాకర్‌రావుకు సలహా ఇచ్చినట్లు శ్రవణ్‌రావు చెప్పినట్లు తెలుస్తోంది. శ్రవణ్‌రావు తన ఛానల్ సిబ్బంది ద్వారా పోటీతీవ్రంగా ఉన్న కొన్ని నియోజకవర్గాల్లో అప్పటి ప్రతిపక్షం తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారికి సహకరిస్తున్న వారి ఫోన్ నంబర్లు సేకరించి ప్రభాకర్‌రావుకు పంపేవారని, వీటిని ట్యాప్ చేయించి వారిని కట్టడి చేసేందుకు ఉపయోగించేవారని, ఇందులో ప్రణీత్‌రావు ప్రమేయమూ ఉందని సిట్ దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. హరీశ్-ప్రభాకర్‌రావులు కలుసుకున్న సందర్భంలోనే ఈ మొత్తం వ్యవహారానికి బీజం పడిందని సిట్ భావిస్తోంది. దీన్ని నిర్ధారించుకునేందుకే హరీశ్‌రావుకు నోటీసులిచ్చింది.

## దోమలు కుట్టి జనం చావటం లేదా.. కుక్కలు కరిస్తేనే మాట్లాడతారా..?

- మొదటి పేజి తరువాయి

చేస్తున్నాయని ప్రశ్నించారు. ఈ ప్రెస్ మీట్ వల్ల తనపై నెగిటివిటీ పెరుగుతుందని తనకు తెలుసని, అయినా తాను భయపడనని అన్నారు. తాను చెప్పడం వల్ల ఒక్కరైనా మారతారేమో అని ఆశిస్తున్నానని అన్నారు. ప్రభుత్వం వీధి కుక్కలకు ప్రత్యేక షెల్టర్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విదేశీ బ్రీడ్స్ పెంచుకునే యజమానులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.

## మేడారంలో సీఎం పూజలు

- మొదటి పేజి తరువాయి

ప్రాంగణాన్ని పునఃప్రారం బించారు. అనంతరం తన కుటుంబంతో కలిసి పసదేవ తలు సమ్మక్క సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహిం - చారు. మనవడితో కలిసి నిలువెత్తు బంగారాన్ని సీఎం సమర్పించుకున్నారు.. గద్దెల ప్రాంగణంలో పైలాను సీఎం ఆవిష్కరించారు. అంతకు ముందు తన మన వడితో కలిసి 68 కిలోల నిలువెత్తు బంగారాన్ని సమ ర్పించుకున్నారు. గద్దెల ం గణంలో మంత్రి సీతక్క సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ 2 సభ్యులకు, మంత్రులకు 3 దేవతల ప్రసాదం, చీరె సారె బహుకరించారు. ప్రభుత్వంరూ.251 కోట్లతో మేడారంలో అభివృద్ధి పనులను ప్రారం భించగా... ఆ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఇతర ప్రజాప్రతి నిధులతో కలిసి ఆదివారం సాయంత్రం మేడారం పర్యట నకు వచ్చారు. డిప్యూటీ సీఎం. భట్టి విక్రమార్క, మంత్రివర్గ సహచరులు వివేక్ వెంకట స్వామి. ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ. సీతక్క జూపల్లి కృష్ణారావు తదితర మంత్రి వర్గ సహచ రులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి బస్సులో జంపన్న వాగు సర్వీల్ వరకు ప్రయాణించి, జాతరకు వచ్చే లక్షలాద్. భక్తుల కోసం చేసిన ఏర్పాట్ల మన్వయంగా పరిశీలించారు.

## దావోస్ కు బయల్దేరిన రేవంత్ రెడ్డి

తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనకు బయలుదేరారు. ఈ ఉదయం మేడారం వనదేవతల దర్శనం పూర్తి చేసుకున్న రేవంత్ రెడ్డి... అక్కడి నుంచి నేరుగా హెలికాప్టర్‌లో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు బయల్దేరారు. ఐదు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో రేవంత్ రెడ్డి అంతర్జాతీయ స్థాయి సీఈఓలు, పారిశ్రామికవేత్తలతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను వివరించనున్నారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. తెలంగాణలో మౌలిక వసతులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, వ్యాపారానికి అనుకూల వాతావరణాన్ని గ్లోబల్ ఇన్వెస్టర్లకు వివరించనున్నారు. ఈ పర్యటనలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు కూడా పాల్గొననున్నారు. మేడారం అమ్మవార్ల ఆశీస్సులతో ప్రారంభమైన ఈ విదేశీ పర్యటన తెలంగాణకు కొత్త పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు తీసుకువస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

## కొత్త పార్టీ ఏర్పాటుపై వేగం పెంచిన కవిత

కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా చేస్తున్న ప్రయత్నాల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వేగం పెంచారు. తెలంగాణ రాష్ట్ర స్థితిగతులు, సమగ్రాభివృద్ధి, వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి పరిష్కారాలు, వనరుల వినియోగంపై అధ్యయనం కోసం గతంలోనే కమిటీలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం ఆయా కమిటీ సభ్యులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాము చేస్తున్న అధ్యయనం గురించి వివరించి, ప్రాథమిక నివేదికను కమిటీ సభ్యులు సమర్పించారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి అవసరమైన బ్లూప్రింట్ రూపొందించే పనిలో తెలంగాణ జాగృతి నాయకులు నిమగ్నమయ్యారు. రెండు, మూడు నెలల్లో నూతన రాజకీయ ఏర్పాటుపై మరింత స్పష్టత వస్తుందని జాగృతివర్గాలు తెలిపాయి.

**ప్రశాంత్ కిశోర్‌తో భేటీ?**

కొత్త పార్టీ ఏర్పాటు దిశగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సన్నద్ధమవుతున్న నేపథ్యంలో.. రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో ఆమె భేటీ అయినట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ ఏర్పాటు, ప్రజా సమస్యలపై పోరాటం, జనం కోణంలో పనిచేసే విధానం తదితర అంశాలపై ఆయనతో కవిత సుదీర్ఘంగా చర్చించినట్లు ప్రచారంలో ఉంది. ఈ విషయాన్ని జాగృతి వర్గాలు అధికారికంగా ధ్రువీకరించలేదు.

## 270 ఏళ్ల తర్వాత పూర్తిస్థాయిలో కేరళ కుంభమేళా

- మొదటి పేజి తరువాయి

ప్రశంసించారు. సనాతన సంప్రదాయాన్ని పాటించడం అంటే మరెవరికో వ్యతిరేకం కాదని ఆయన అన్నారు. భారతదేశం అందరినీ తనలో కలుపుకుని ముందుకు సాగుతుందని అన్నారు.

నీల నదిని భరతపూజ నది అని కూడా అంటారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల సమ్మేళనంగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ మహా మాఘ మహోత్సవాన్ని సుమారు 270 సంవత్సరాల తర్వాత పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నట్లు సమాచారం. చివరి పూర్తిస్థాయి మహా మాఘ మహోత్సవం 1755లో జరిగిందని రికార్డులు వెల్లడిస్తున్నాయి. నేడు ప్రారంభమైన ఈ మాఘ మహోత్సవం ఫిబ్రవరి 3 వరకు 15 రోజుల పాటు కొనసాగుతుంది. కేరళ, తమిళనాడుతో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి పుణ్యస్నానమాచరిస్తారు. ఈసారి సుమారు 50 వేల మంది భక్తులు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. మాఘ మహోత్సవం సందర్భంగా కేరళ ఆర్టీసీ సుమారు 100 బస్సులను ఏర్పాటు చేసింది. ఈ పదిహేను రోజుల పాటు పాండిత్య చర్చలు, కలరిపయట్టు, యోగా, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు.

# మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీని నామరూపాలు లేకుండా చేస్తాం.

● జిల్లా నాయకులు దేగల అంజయ్య యాదవ్.



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 19.వలిగొండ యాదాద్రి : వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు దేగల అంజయ్య మీడియాతో మాట్లాడుతూ.

మున్సిపల్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ మొత్తం మున్సిపల్ చైర్మన్ స్థానాలు భారీ మెజారిటీ తో కైవసం చేసుకుంటామని అన్నారు బీజేపీ తెరాస మున్సిపల్ ఎన్నికల్లో భూస్థాపితం అయితవి అని అన్నారు మొన్న స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ ఒక స్థానము కూడా గెలువలేదు బి ఆర్ ఎస్ కూడా గోర పరాజయం అయినారు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అన్ని మున్సిపల్ స్థానాలు కైవసం చేసుకుంటాము అని దిమా వ్యక్తం చేసారు.

# పహిల్వాన్ పురం నుండి టేకుల సోమారం వరకు నూతన బీటీ రోడ్డును నిర్మించాలి...

● CPM డిమాండ్....



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 19. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ.

పహిల్వాన్ పురం నుండి టేకులసోమారం వరకు పూర్తిగా గుంతలమయమైన బీటీ రోడ్డు స్థానంలో నూతన బీటీ రోడ్డును నిర్మించాలనీ జూవీ మండల కమిటీ సభ్యులు సీనియర్ నాయకులు చీర్క శ్రీశైలం రెడ్డి,సిపిఎం శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి బిక్షపతి డిమాండ్ చేశారు

సోమవారం రోజున పహిల్వాన్ పురం-టేకుల సోమారం బీటీ రోడ్డుపై సిపిఎం ఆధ్వర్యంలో నూతన బీటీ రోడ్డు కోసం డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు చీర్క శ్రీశైలం రెడ్డి సిపిఎం శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి బిక్షపతి మాట్లాడుతూ

పహిల్వాన్ పురం-టేకుల సోమారం రోడ్డు అద్వానంగా మారడం పెద్ద ఎత్తున గుంతలు పడడం వల్ల అనేకమంది ద్విచక్ర వాహనదారులు,ఆటోలలో ప్రయాణం చేసే ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ప్రజల ప్రాణాలు పోతనే పట్టించుకుంటారా అని అధికారులను ప్రశ్నించారు

గతంలో అనేక సార్లు ఈ సమస్యపై పోరాడిన అధికారులు స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు

ఇప్పటికైనా అధికారులు స్థానిక ఎమ్మెల్యే గారు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో శాఖ సహాయ కార్యదర్శి రాగీరు కృష్ణ స్వామి,రేపాక ముత్యాలు,వట్టిపల్లి చంద్రయ్య,గ్రామ ప్రజలు రైతులు గడ్డమిది ధనుంజయ,తదితరులు పాల్గొన్నారు

# గణతంత్ర దినోత్సవ వేడుకలలో అంబేద్కర్ చిత్రపటం తప్పనిసరి.

జిల్లా అడిషనల్ కలెక్టర్కు వినతిపత్రం అందజేత.



సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 19. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం.-మాల మహానాడు ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) భాస్కరరావుకు వినతి పత్రం అందజేత.

ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలో రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటం పెట్టాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పెరుమాండ్ల యాదగిరి, వలిగొండ మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) భాస్కరరావు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామం నుండి జిల్లా వరకు గవర్నమెంట్ ఆఫీసులలో, ప్రైవేట్ ఆఫీసులలో, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలలో అంబేద్కర్ చిత్రపటం ఉండేలా సూచించాలని అడిషనల్ కలెక్టర్ ను వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కాశమల్ల శేఖర్, సహాయ కార్యదర్శి కట్ట సురేష్, సంస్కృతిక కార్యదర్శి కూచిమల్ల కుమార్, వెలువర్తి గ్రామ అధ్యక్షులు కూచిమల్ల నాగేంద్ర ప్రసాద్, సీనియర్ నాయకులు వలమల్ల రత్నయ్య, జక్క స్వామి, మద్దెల వెంకటేశం, బెల్లపు కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# భట్టి పై అసత్య రాతలు తగవు

- ఖమ్మం డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ హితవు
- 40 ఏళ్ల మచ్చలేని రాజకీయ జీవితంపై విమర్శలా?
- బీజేపీని బలపర్చేందుకే మంత్రివర్గంలో చిచ్చుకు యత్నం
- బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఖమ్మం డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ డిమాండ్



సి కె న్యూస్ ప్రతినిధి:ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై ఏబీఎన్ రాధాకృష్ణ తన 'కొత్త పలుకు'లో రాసిన రాతలు సత్య దూరంగా ఉన్నాయని ఖమ్మం కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అన్నారు. పత్రికా స్వేచ్ఛను అడ్డం పెట్టుకుని ప్రజా నాయకులపై బురద చల్లడం తగదని హెచ్చరించారు. గాంధీ కుటుంబం ప్రేరణతో రాజకీయాల్లోకి వచ్చిన భట్టి విక్రమార్క, గత 40 ఏళ్లుగా సబ్బండ వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని నూతి సత్యనారాయణ గౌడ్ గుర్తు చేశారు. "దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత నమ్మకస్తుడిగా, ఉమ్మడి రాష్ట్రంలో డిప్యూటీ స్పీకర్ గా తెలంగాణ ఏర్పాటులో భట్టి కీలక పాత్ర పోషించారు. మచ్చలేని రాజకీయ చరిత్ర కలిగిన అటువంటి నాయకుడిపై నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదన్నారు.

తెలుగుదేశం పార్టీతో పొత్తులో ఉన్న బీజేపీని తెలంగాణలో బలపరచాలనే దురుద్దేశంతోనే ఏబీఎన్ ఇటువంటి అసత్య కథనాలు రాస్తున్నదని అర్థమవుతుందన్నారు. కావాలని రాష్ట్ర మంత్రివర్గంలో అభిప్రాయ భేదాలు సృష్టించి, ప్రభుత్వంపై అస్థిరత కల్పించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు.

సింగరేణి వ్యవహారంలో వాస్తవాలు తెలుసుకోకుండా కల్పిత గాథలు రాయడం తెలంగాణ సమాజాన్ని కించపరచడమేనన్నారు. భట్టి విక్రమార్క మల్లు ప్రగతిశీల ప్రజాస్వామ్య భావజాలం కలిగిన వ్యక్తి అని, ఉప ముఖ్యమంత్రి గా,ఆర్థిక శాఖా మాత్యులుగా, ఇంధన శాఖా మాత్యులుగా బాధ్యతో నిర్వహిస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలోపెట్టి ఉద్యోగులకు 01 వ తారీఖున జీతాలు ఇస్తూ తెలంగాణ రాష్ట్ర జి డీ పి అభివృద్ధిని పెంచుకుంటూ వస్తున్నారని,తెలంగాణ రాష్ట్రంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉచిత విద్యుత్, రైతు భరోసా, రైతు రుణమాఫీ,మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అనేక విధాలుగా మహిళలకు బ్యాంకు రుణాలు, బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమపదకాలను ప్రవేశ పెడుతున్నారని,బడుగు,బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలని అనేక ఇంటిగ్రేటెడ్ స్కూల్ లు, వైద్యాభివృద్ధికి 100 పడకల ఆస్పత్రులు నిర్మిస్తున్నారని, అటువంటి నిస్వార్థ నేతపై అసత్య ఆరోపణలు రాయడం సూర్యునిపై ఉమ్మి వేసిన చందంగా ఉన్నదని అన్నారు.

"గతంలో కేసీఆర్ ప్రభుత్వం మీ పత్రికను నిషేధించినప్పుడు కాంగ్రెస్ పార్టీ మీకు అండగా నిలబడింది. ఈ రోజు అదే పార్టీకి మీరు వెన్నుపోటు పొడుస్తున్నారు. మీ చానల్ కు, ఇతర మీడియా సంస్థలకు ఉన్న వ్యక్తిగత తగాదాలను కాంగ్రెస్ పార్టీకి అంట కట్టడం సరికాదన్నారు.

తెలంగాణ సమాజం హర్షించని విధంగా, కేవలం మీ అనుకూల వ్యక్తులను బలపరిచేందుకు రాసే రాతలను కాంగ్రెస్ కార్యకర్తలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఇకనైనా అవాస్తవాలు రాయడం మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజాక్షేత్రంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు.నిన్న జరిగిన ముఖ్యమంత్రి గారి ఖమ్మం పర్యటనను విజయంతం చేసిన నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు,శ్రేణులు అందరికీ కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు.

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం.





- పల్లెల్లో పర్యాటక అభివృద్ధితో ఆర్థిక ప్రగతి సాధ్యం.
- గ్రామ పంచాయతీ సర్పంచుల శిక్షణ తరగతుల్లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్..

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),జనవరి 19,గ్రామాల సమగ్ర అభివృద్ధిలో గ్రామపంచాయతీ సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వం అందిస్తున్న నిధులను నియమ నిబంధనలకు అనుగుణంగా సక్రమంగా వినియోగించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సర్పంచులకు పిలుపునిచ్చారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కెఎస్ఎం ఓల్డ్ క్యాంపస్)లో ఏర్పాటు చేయగా, జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని మొత్తం 471 మంది గ్రామపంచాయతీ సర్పంచులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని విడతల వారీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులు 19-01-2026 నుండి 23-01-2026 వరకు, 03-02-2026 నుండి 07-02-2026 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సోమవారం ప్రారంభమైన తొలి విడతలో భాగంగా జిల్లాలోని 14 మండలాలకు చెందిన 237 మంది నూతన గ్రామ పంచాయతీ సర్పంచులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైందని అధికారులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులకు గ్రామ పాలన, పరిపాలన విధానాల పై సమగ్ర అవగాహన కల్పించడమే ఈ శిక్షణ కార్యక్రమాల లక్ష్యమని అన్నారు.

శిక్షణలో భాగంగా పంచాయతీ రాజ్ చట్టం, గ్రామ పాలనలో పాటించవలసిన విధులు, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, సర్పంచుల బాధ్యతలు, కర్తవ్యాలపై సవివరంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గ్రామ పంచాయతీ లకు అందే వివిధ అభివృద్ధి పథకాల నిధులను సక్రమంగా వినియోగించుకుని, ప్రజల మౌలిక అవసరాలైన తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, ఆరోగ్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సర్పంచులకు సూచించారు. గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అలాగే రోడ్లు, వీధిదీపాలు, విద్యుత్ స్తంభాలు, పబ్లిక్ టాయిలెట్లు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.

ప్రతి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు సక్రమంగా ఉన్నాయా లేదా సర్పంచులు నిరంతరం పర్యవేక్షించాలని, చిన్నారులు, బాలింతలకు పోషకాహారం సముచితంగా అందుతున్నదీ లేనిదీ పరిశీలించాలని సూచించారు. అలాగే అక్షరాస్యత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పోస్ట్ ఆఫీస్‌లో ఖాతా తెరిచి సంవత్సరానికి రూ.500 చెల్లిస్తే ఇన్సూరెన్స్ లభించే ఎన్ఎస్పీఎస్ పథకంలో గ్రామస్తులు చేరేలా సర్పంచులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పథకం ద్వారా కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో అంత్యక్రియల నిమిత్తం రూ.20,000 ఆర్థిక సహాయం లభిస్తుందని వివరించారు. జిల్లాలో అనేక అందమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నప్పటికీ సరైన ప్రచారం లేక అభివృద్ధికి దూరంగా ఉన్నాయని అన్నారు. ప్రతి సర్పంచ్ తమ గ్రామాల్లోని పర్యాటక ప్రదేశాలు, సహజ వనరులు, విశిష్టతలను విస్తృతంగా ప్రచారం చేస్తే అవి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెంది గ్రామాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని తెలిపారు.

సర్పంచులు కేవలం పంచాయతీ శాఖకే పరిమితం కాకుండా,గ్రామపంచాయతీలో జరిగే ప్రతి పనిలో అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని చొరవ తీసుకొని గ్రామాభివృద్ధికి నాయకత్వం వహించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే ప్రతి గ్రామంలో ఇప్ప, ఇప్పపువ్వు చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలని, దీని ద్వారా లక్షల రూపాయల ఆదాయం వచ్చే అవకాశముందని తెలిపారు. పశుసంపద పెంపుదలతో పాటు మేత సంపద సృష్టి జరిగి ప్రభుత్వ సబ్సిడీలు కూడా లభిస్తాయని వివరించారు.

గ్రామాల్లోని 18 నుంచి 20 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతపై ప్రత్యేక దృష్టి సారించి, జిల్లా యంత్రాంగం నిర్వహించే ఇంటర్వ్యూలు, ఉపాధి అవకాశాలకు వారిని ప్రోత్సహించాలని, యువతను ప్రయోజకులుగా మార్చే దిశగా సర్పంచులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీపీఓ సుధీర్, శిక్షణ డీపీఓ అనూష, డీఎల్పీఓలు ప్రభాకర్, రమణ, టీజీఐఆర్డీ సెంటర్ హెడ్ సుభాష్ చంద్ర గౌడ్, ట్రైనర్లు బన్సింగ్, రవీందర్ రెడ్డి, సునీల్ కుమార్, ముత్యాలరావు, హజ్రత్ వలి, ఏపీవో రంగ, ఎస్బీఎం రేవతి, డిటిఎం సందీప్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# ప్రతి మహిళ ఇందిరా డైరీ ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందాలి



## డైరీ షెడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో సర్పంచ్ నారగాని. రాంబాయి

సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.తెలంగాణ ఉపముఖ్యమంత్రి ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఏర్పాటు చేసిన పథకం ఇందిరా డైరీ ద్వారా మహిళలు గేదెలు పెంపకం ద్వారా వచ్చే ఆదాయంతో ఆర్థిక స్వావలంబన చెందాలని నాగులవంచ గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో కామిశెట్టి ఆదెమ్మ కి ఇందిరా డైరీ ద్వారా మంజూరైన గేదెల షెడ్లు కు ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నారగాని మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా మంజూరైన గేదేలు యూనిట్లను సక్రమంగా వినియోగించుకొని పాల ఉత్పత్తుల అమ్మకం ద్వారా లక్షాధికారులు అవ్వాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ యూనిట్ను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంబటి శరత్ , గ్రామ పంచాయతీ కార్యదర్శి బుద్దే చిరంజీవి, వార్డు మెంబర్ కాసాని బాలా కుమార్ గౌడ్, గ్రామ దీపికలు గురిజాల వెంకటేశ్వరమ్మ, మంద శిరీష, గ్రామ పంచాయతీ సిబ్బంది, యన్ఆర్ఈజియస్ టెక్నికల్ అసిస్టెంట్స్ రాజు, హుస్సేన్, ఫీల్డ్ అసిస్టెంట్ యం నాగరాజు, బైరు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# సోమ శేషమ్మ పార్ధివదేహానికి నివాళు లర్పించిన టిఆర్ఎస్ జిల్లా నాయకులు.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.బస్వాపురం బిఆర్ఎస్ నాయకులు సోమ నాగేశ్వరరావు తల్లి శేషమ్మ తెల్లవారుజామున చనిపోయినారు వారి పార్థివదేహానికి నివాళులర్పించిన బిఆర్ఎస్ జిల్లానాయకులు మంకెన రమేష్ మండల పార్టీ కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు మాజీ సొసైటీ డైరెక్టర్ వంకాయలపాటి లచ్చయ్య చేట్టి మోహన్ రావు చేట్టి సురేష్ ఆవుల కొరివి తదితరులుపాల్గొన్నారు

# ఖమ్మం జిల్లాలో లక్షా 98 వేల ఎకరాల అదనపు ఆయకట్టు లక్ష్యం....

**వందనం గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క...**





**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి** :చింతకాని : ఖమ్మం జిల్లాలో లక్షా 98 వేల ఎకరాల అదనపు ఆయకట్టు సాధించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం చింతకాని మండలం వందనం గ్రామంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్తులతో కలిసి పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. 2,500 ఎకరాలకు సాగునీరు అందించినందుకు 35 కోట్ల 75 లక్షలతో చేపట్టిన కోదుమూరు- వందనం ఎత్తిపోతల పథకం రెండో విడత పనులకు, వందనం ఎస్సీ కాలనీలో 1 కోటి 85 లక్షలతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్లకు ఆర్ అండ్ బి రోడ్డు నుంచి వందనం -పుట్టకోట జడ్పీ రోడ్డు వరకు మూడు కోట్ల 50 లక్షలతో నిర్మించునున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రైతుల సాగునీటి సమస్యల పరిష్కారానికి ఈ లిఫ్ట్ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి గత రెండేళ్లలో 74 వేల 163 కోట్లు, పేదల సంక్షేమానికి 47 వేల 710 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రైతు సంక్షేమం, గ్రామీణ అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లాస్థాయి, అధికారులు ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సీఎం కప్ పోటీలకు సాంకేతిక హంగులు







**సికె న్యూస్ ప్రతినిధి:**తెలంగాణ ప్రభుత్వం క్రీడా శాఖ తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న రెండో విడత సీఎం కప్2025-26
ను సాంకేతిక సహకారంతో క్రీడాకారులకు సమగ్ర సమాచారం ఇవ్వడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.
గత సంవత్సరం నిర్వహించిన సీఎం కప్ - 2024గ్రామీణ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు
దాదాపు మూడు లక్షల విద్యార్థిని విద్యార్థి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అదే స్ఫూర్తిని కొనసాగించడానికి రెండవ విడత సీఎం కప్ 2025-26 ని నిర్వహించాలని తెలంగాణ క్రీడా శాఖ ఏర్పాట్లు చేస్తోంది.
సెకండ్ ఎడిషన్ సీఎంకప్ 2025 సాంకేతికత ఆధారిత ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ
సీఎంకప్ 2025 లో పాల్గొనే క్రీడాకారులకుసాంకేతికత
సహాయ, సహకారం ద్వారా
సరళమైన, , సమాచారము సంక్షిప్తం చేయడం దీని ముఖ్య ఉద్దేశం
సహాయం
ఏఐ చాట్‌బాట్ (24ఐ7)
ఆటగాళ్లు, కోచ్‌లు, అధికారులు ఎప్పుడైనా ఏఐ చాట్‌బాట్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. ఇది తక్షణ మార్గదర్శనం అందించి, సంబంధిత విభాగానికి ఫిర్యాదులను స్వయంచాలకంగా పంపిస్తుంది.
సహకారం
వాట్సాప్ బాట్
వాట్సాప్ ద్వారా సులభంగా ఫిర్యాదులు నమోదు చేసి, వాటి స్థితిని ట్రాక్ చేయవచ్చు. మీ నమోదు చేసిన మొబైల్ నంబర్‌కు రియల్ టైమ్ అప్‌డేట్లు
పంపించడం జరుగుతుంది.
సమాచారం
ఏఐ కాల్ సెంటర్ (ఇన్‌బౌండ్ & అవుట్‌బౌండ్)
ఫిర్యాదు నమోదు, ఫాలో-అప్‌లు, పరిష్కార సమాచారం కోసం కాల్ సపోర్ట్ అందుబాటులో ఉంటుంది. ఫిర్యాదు స్థితి మరియు ముగింపు వివరాలను ఆటోమేటెడ్ కాల్స్
ద్వారా తెలియజేస్తుంది.
సమన్వయము కేంద్రీకృత ఫిర్యాదు ట్రాకింగ్ వ్యవస్థ అన్ని ఫిర్యాదులు ఒకే వేదికపై నమోదు చేయబడి, నిర్ణీత కాల పరిమితులలో పర్యవేక్షించబడి, పారదర్శకంగా పరిష్కరించబడతాయి దీని ద్వారా బాధ్యత మరియు వేగవంతమైన పరిష్కారం సాధ్యం అవుతుందని అధికారులు తెలిపారు. ఇందుకోసం తెలంగాణ రాష్ట్ర ఐటీ విభాగం సహకారంతో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సీఎం కప్ పోటీలో పాల్గొనే ప్రతి క్రీడాకారుడి సమాచారం నిక్షిప్తం చేసి భవిష్యత్తులో జరిగే క్రీడా పోటీల సమాచారం ఎప్పటికప్పుడు వారికి అందజేయడానికి క్రీడా శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

## తుమ్మలపల్లివెంకటనారాయణ చిత్రపటానికి నివాళులు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**మండల పరిధిలోని నాగులవంచ మాజీ వెటర్నరీ అసిస్టెంట్ తుమ్మలపల్లివెంకటనారాయణ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు.కార్యక్రమంలో రాష్ట్రపంచాయితీ రాజ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అంబటి శాంతయ్య ,మండలటిఆర్ఎస్ నాయకులు వంకాయలపాటి లచ్చయ్య, వంకాయలపాటి సత్యం, సామినేని బాబురావు, మండలసిపిఎం నాయకులు తోటకూరవెంకటనరసయ్య ,సామినేనిఅప్పారావు,మండల కాంగ్రెస్ నాయకులు ఆలస్యం బసవయ్య, మండల బిజెపి నాయకులు మద్దినేని వెంకటేశ్వరరావు,టిఆర్ఎస్ నాయకులు అంబటి సైదేశ్వరరావు, తోటకూరి చిన్న, కొల్లి బాబు ,అంబటి సత్యనారాయణ, ఎండోమెంట్ ఈవో తోటకూరి వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు ఆలస్యం శంకర్ ,గ్రామ పెద్దలు
అయినాల నాగేశ్వరరావు, అయినాల సంజీ పాల్గొన్నారు.

## శ్రీ ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో, మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు,

**చెరుకు శ్రీనివాస్ రెడ్డి**



**జనవరి 19 సీ కే న్యూస్ చేగుంట/**చేగుంట మండలం కర్నాలపల్లి గ్రామంలో గల ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న, మల్కాజ్ గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని ని శాలువా తో సన్మానం చేశారు, ఈ కార్యక్రమం లో సర్పంచ్ దుర్గ దేవి రాములు గౌడ్, ఉప సర్పంచ్ శివ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఏనుగు మల్లారెడ్డి ఆత్మ శాంతి కలగాలని వారి ఫోటోకు పూలమాలను వేసి ప్రార్థన చేశారు



**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్:**ఏనుగు మల్లారెడ్డి గారి సంవత్సరీకానికి పల్లెర్ల గ్రామంలో ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కుమారుడు రిటైర్డ్ గవర్నమెంట్ టీచర్ సత్యవతి నర్సిరెడ్డి గారు మనవడు లిఖిత రత్నాకర్ రెడ్డి మరియు సుధా రాజశేఖరరెడ్డి మరియు కూతుర్లు మనవడు మనవరాలు గ్రామ పెద్దలు పాల్గొని ఆయన ఆత్మ శాంతికి కలగాలని ప్రార్థన చేశారు

## రోడ్డు భద్రత పై రూల్స్ పాటించాలి, డి ఎస్పి నరేందర్ గౌడ్



**జనవరి 19 (సీ కే న్యూస్) చేగుంట:** చేగుంట మండల్ వడియారం బైపాస్ వద్ద రోడ్డు ప్రమాదాలపై నివారణకు,రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని తూప్రాన్ డి ఎస్పి నరేందర్ గౌడ్ అన్నారు. సోమవారం చేగుంట మండలంలోని వడియారం సమీపంలో గల జాతీయ రహదారి 44 పక్కన చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత విషయాలు, రోడ్డు సేఫ్టీ తదితర విషయాలపై అవగాహన కార్యక్రమం పాల్గొన్న తూప్రాన్ డి ఎస్పి నరేందర్ గౌడ్,ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ. రోడ్డు భద్రత నియమ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు, ఈ కార్యక్రమం లో చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి,ఎస్ఐ 2,బిక్య నాయక్, వడియారం సర్పంచ్ సాయికుమార్ గౌడ్, చిన్న శివనూర్ ఉపసర్పంచ్ బొల్ల ప్రశాంత్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గొల్లమందల శ్రీనివాసరావు( సుబ్బు)కు నివాళులర్పించిన సర్పంచ్ కోడూరు వీర కృష్ణ ఉమాదేవి...

**కార్యక్రమంలో పాల్గొన్న వార్డ్ మెంబర్లు ఎంఆర్పిఎస్ నాయకులు....**



**తల్లాడ, జనవరి 19( సీకే న్యూస్ ప్రతినిధి విజయ్)::**
తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామంలో గొల్లమందల శ్రీనివాసరావు ఇటీవల కరెంట్ షాక్ తో మరణించారు,శ్రీనివాసరావు దశదిన కార్యక్రమం గొల్లగూడెం వారి గృహంలో నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి సర్పంచ్ కోడూరు వీర కృష్ణ ఉమాదేవి హాజరై శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం సానుభూతి తెలియజేశారు.అధైర్య పడవద్దని కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు.
ఈ కార్యక్రమంలో ఆయన వెంట వార్డ్ మెంబర్ దుర్గారావు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఇస్నేపల్లి వీరయ్య, గొల్లమందల సింహాద్రి,సుందర్ రావు, ఇస్నేపల్లి దాసు, ఇస్నేపల్లి వెంకటేశ్వర్లు( పెద్ద మాదిగ ), ఇసనపెల్లి లక్ష్మణ్, పగిడిపల్లి సురేష్, ఏసోబు, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు ఇశ్నేపల్లి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## పోతిరెడ్డిపల్లి సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డ్ నెంబర్లు ఆలేరు ప్రభుత్వ విప్పు బీర్ల ఐలయ్య గారిని కలవడం జరిగింది

**సి కె న్యూస్ ఆత్మకూర్ యం రిపోర్టర్ శైక్ అజిజ్:**యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామం నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచ్ నాగుల సత్యనారాయణ యాదవ్ ఉప సర్పంచ్ మెట్టు లలిత వార్డు మెంబర్లు ఇంద్రాల అంజయ్య మక్తల మంగమ్మ ఇంద్రాల రేణుక ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు శ్రీ బీర్ల ఐలయ్య గారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది గ్రామములో పలు అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామపంచాయతీ లెటర్ ద్వారా ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకుపోవడం జరిగింది దానిలో ప్రధానంగా1, బిక్కేరువాగుపై హై లెవల్ వంతెన నిర్మాణం పారుపల్లి ఎక్స్ రోడ్డు వయా పోతిరెడ్డిపల్లి నుండి రహీంఖాన్ పేట వరకు బిటి రోడ్డు నిర్మాణము గురించి మరియు 2,గ్రామపంచాయతీ నూతన భవనం గురించి 3,బిసి కమ్యూనిటీ భవనము గురించి 4,సిసి రోడ్ల నిర్మాణము అండర్ గ్రౌండ్ డ్రైనేజీ గురించి తెలియజేయడం జరిగింది ఎమ్మెల్యే గారు వీటిపై సానుకూలంగా స్పందించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎడమ మోహన్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు నాగుల ఆనంద్ యాదవ్
జక్కు మల్లారెడ్డి మెట్టు అంతిరెడ్డి మంచోజు అమరేంద్ర చారి





కడకంచి కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## కలిసికట్టుగా గ్రామ అభివృద్ధికి పాటుపడదాం

- సర్పంచ్ తాలూకా మహేశ్వరీ
- చందాయిపేట గ్రామంలో మొదటి గ్రామసభ



**జనవరి 19. (సి కే న్యూస్) చేగుంట /**చేగుంట మండల్ చందాయిపేట గ్రామపంచాయతీలో నూతనంగా ఎన్నికైన పాలకవర్గం సోమవారం పంచాయతీ సెక్రటరీ కృష్ణ ఆధ్వర్యంలో మొట్టమొదటి గ్రామసభ నిర్వహించారు,.
గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్,
వార్డు సభ్యులు సంబంధిత అధికారులు పాల్గొని,గ్రామ ప్రజల నుండి వచ్చిన సమస్యలపై స్పష్టంగా,బాధ్యతతో చర్చించారు, ఈ సందర్భంగా సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా మాట్లాడుతూ
గ్రామ అభివృద్ధే లక్ష్యంగా,ప్రజల సమస్యలే ప్రాధాన్యంగా
కలిసికట్టుగా ముందుకు సాగుతామని
అన్నారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పబ్బ నగేష్ గుప్తా, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కిషన్,సి హెచ్ ఓ షైక్ అన్నీస్ ద్దీన్, ఉపాధి హామీ సిబ్బంది, అంగన్వాడీ టీచర్, సి ఏ, లు,ఆశ వర్కర్లు,అధికారులు,వార్డు సభ్యులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

# పారుపల్లి గ్రామంలో బహుమతుల ప్రదానోత్సవం

**సి కె న్యూస్ ఆత్మకూరు ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :** పారుపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా దాత ల సహకారంతో క్రీడల దాతలు మస్కపురం సంతోష్ గారు మరియు నల్లబోలు విజయ్ కుమార్ గారు గల్లీ క్రికెట్,కబడ్డీ వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరిగింది.ఈ నిర్వహించినటువంటి క్రీడల్లో గెలుపొందినటువంటి టీమ్ లకు ఈ రోజు బహుమతులు అందజేయడం జరిగింది.
ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిధి గా గౌరవనీయులు ఆలేరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బూడిద బిక్షమయ్య గారు విచ్చేయడం జరిగింది.
ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ శ్రీమతి దయ్యాల మాధవి శ్రీనివాస్ గారి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లగ్గాని రమేష్ గారు,మాజీ వైస్ ఎంపిపి బూడిద రాములు గారు మాజీ ఎంపిటిసి కాలే మల్లేశం గారు,వార్డ్ మెంబర్లు టీఆరెస్ గ్రామ శాఖ అధ్యక్షులు లగ్గాని రంగయ్య గారు బిజ్జాల సోమరాజు గారు లగ్గాని సోమేశ్ గారు బయ్యని నవీన్ గారు దయ్యాల మహేష్ గారు ఆర్గనైజర్లు సతీష్ తిరుపతి రెడ్డి నరేష్ సోమరాజు సాయిబాబా మరియు గ్రామ ప్రజలు ప్రజా ప్రతినిధులు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.



## 20న ఇల్లెందులో జరిగే భారీ ప్రదర్శన, సభ ను జయప్రదం చేయండి.

- సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఇల్లందు డివిజన్ నాయకులు నోముల భానుచందర్



సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి (వెంకటేష్),జనవరి 19,
భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల ఆవిర్భావం సందర్భంగా ఇల్లందులో ప్రదర్శన ఐతా ఫంక్షన్ హాల్ లో జరిగే సభను జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఇల్లందు డివిజన్ నాయకులు నోముల. భానుచందర్ పిలుపునిచ్చారు.
వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమంలో ఎంతోమంది తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించారని ఎన్నో ఉద్యమాలను నిర్మించిందని కూడు గూడు నీడ కోసం ఎన్నో ఉద్యమాలు చేసి సాధించి పెట్టిందని తెల్ల బట్టల వాళ్ళను చూస్తే భయపడ్డా ఆదివాసీలను చైతన్యవంతం చేసి ఫారెస్టు భూస్వాములను వ్యతిరేకించి లక్షలాది ఎకరాల భూమిని పంచిపెట్టిన చరిత్ర ఎర్రజెండాకు ఉందని ఆయన అన్నారు. అట్టి భూములకు పట్టాలు సాధించిపెట్టిందని ఎన్నో గ్రామాలకు విద్యాలయాలు నిర్మించిందని వైద్యం రవాణా రోడ్లు నిర్మించిందని వారు గుర్తు చేశారు. ఉన్నత చదువులు చదివి ఉన్నత కుటుంబాలలో జన్మించి ఉన్నతమైన ఉద్యోగాలని వదిలేసి ఈ ఉద్యమంలో పేద ప్రజల కోసం నూతన ప్రజాస్వామ్య విప్లవం కోసం ఎన్నో పోరాటాలు చేశారని ఆయన అన్నారు. నిజాం నవాబు కు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం శ్రీకాకుళం గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాలు నిర్మించిందని కూలిరేట్లను పెంచిందని కార్మికులను ఐక్యం చేసి కార్మిక హక్కులను కాపాడడంలో ప్రధాన పాత్ర పోషించిందని వారు అన్నారు. ప్రధానంగా ఏజెన్సీలో ఆదివాసి చట్టాలను అమలు చేయించడంలో తమ వంతు పాత్రను తమ ప్రాణాలను లెక్కచేయకుండా అమలు చేయించగలిగారని అది ఒక ఎర్రజెండాకే సాధ్యమని వారు అన్నారు. ఎన్నో ఏండ్లుగా వెనుకబడిన తెలంగాణను సాధించడంలో విఫలమైన బూర్జువా పార్టీలను పక్కనపెట్టి ఎర్రజెండా ఎత్తుగడతో తెలంగాణను సాధించడంలో తన వంతు ప్రధాన పాత్ర పోషించిందని అదే విధం గా నిరుద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించిందని వారు అన్నారు.భారత దేశంలో ఎర్రజెండా పాత్ర మరువలేనిది. భారత ఉద్యమంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ఇప్పటివరకు పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడి సాధిస్తూనే ఉందని అలాంటి ఉద్యమాలను నెమరు వేసుకుంటూ భవిష్యత్తు కర్తవ్యాలను నిర్మించడం కోసం ప్రజా ఉద్యమాలను ఎలా నిర్మించాలో అంచనా వేసుకోవడం కోసం జనవరి 20 న ఇల్లెందులో జరిగే సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభకు ముఖ్య భక్తులుగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వేములపల్లి వెంకటరామయ్య, ఆవునూరి మధు, జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె సీతారామయ్య, ఇల్లెందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగిస్తారని వారు తెలియజేశారు.

## మాజీ మంత్రి పువ్వాడ అజయ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్ లోకి భారీ చేరికలు...

- బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్..
- బిఆర్ఎస్ పార్టీలో చేరిన వైరా మున్సిపాలిటీ రెండవ వార్డుకు చెందిన పలు కాంగ్రెస్ కుటుంబాలు



సి కె న్యూస్ ప్రతినిధి:వైరా మున్సిపాలిటీ పరిధిలోని 2 వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకులు తిరుపతి శ్రీను తో పాటు పలు కుటుంబాలు సోమవారం హైదరాబాద్ లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వారికి కండువా కప్పి బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.
ఈమధ్య జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక సీట్లు సాధించిందని ప్రజల్లో ఆదరణ పెరిగిందని మరలా కేసీఆర్ ప్రభుత్వమే కోరుకుంటున్నారని అన్నారు.
కాంగ్రెస్ ఇచ్చిన అబద్ధపు హామీలు నెరవేర్చలేక పోయిందని ప్రజల్లోకి వెళ్లలేక పోతున్నామని రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ కు ఉన్న ఆదరణ చూసి కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్ లోకి చేరుతున్నామని నాయకులు అన్నారు.
ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు,వనమా విశ్వేశ్వరరావు,బిఆర్ఎస్ వైరా మండల పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు,మద్దేల రవి, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, మాదినేని ప్రసాద్,మేదరమెట్ల రాము, వజినేపల్లి చక్రవర్తి, ఏదునూరి శ్రీను,వేముల రవి,బత్తుల లింగారావు,బత్తుల వెంకటేష్,వేముల శివ క్రీష్ణ,,దేవళ్ళ శ్రీను,తమ్మిశెట్టి నరేష్, బత్తుల ఉపెందర్,వల్లేపు శ్రీను,వేముల శ్రీను,బండారు శ్రీనివాస్,తిరుపతి రవి,పల్లపు రాంబాబు,దేవళ్ళ రాంబాబు తదితరులు పాల్గొన్నారు

## మేడారం మహా జాతరలో తప్పిపోతారనే భయం లేదిక..

సి కె న్యూస్ ప్రతినిధి
తెలంగాణా కుంభమేళాగా పేరుపొందిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈసారి అత్యంత వైభవంగా నిర్వహించాలని తెలంగాణా సర్కార్ శతవిధాలా ప్రయత్నం చేస్తుంది.
ఈసారి మేడారం జాతరలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలని భావిస్తున్నారు. దీంతో మేడారం జాతర సకల హంగులతో కొత్త రూపు సంతరించుకోబోతుంది.
మేడారం మహా జాతరకు కమాండ్ కంట్రోల్ రూమ్
జనవరి 28 నుంచి 31 వరకు జరగనున్న ఈ మహోత్సవం కోసం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ూ×) ఆధారిత వ్యవస్థలను ఉపయోగిస్తున్నారు. ఇక తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం భద్రతా ఏర్పాట్లపై సమీక్షించి, జాతరలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు.







### టీజీ క్వెస్ట్ అత్యాధునిక డ్రోన్ వ్యవస్థ

మేడారం జాతరలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం, ఎవరూ తప్పిపోకుండా ప్రజలందరికీ సురక్షిత జాతర అనుభవం కలిగించేలా జాతర భద్రతను పర్యవేక్షించేందుకు 'టీజీ-క్వెస్ట్' అనే అత్యాధునిక ఏఐ డ్రోన్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ వ్యవస్థ ద్వారా 30 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన అటవీ ప్రాంతం, జంపన్నవాగు, రద్దీ రోడ్లపై ఈ డ్రోన్లు నిరంతరం నిఘా ఉంటాయి.బి

### 13 వేల మంది పోలీస్ సిబ్బంది సాంకేతిక నిఘాలో విధులు

అవి మాత్రమే కాకుండా హీలియం బెలూన్లకు అమర్చిన పాన్-టిల్ట్-జూమ్ కెమెరాలు ఎత్తు నుంచి రద్దీని విశ్లేషిస్తాయి. తొక్కిసలాట జరిగే అవకాశమున్న ప్రాంతాలను ముందే పసిగట్టి అధికారులను అప్రమత్తం చేస్తాయి. దాదాపు 13 వేల మంది పోలీసు సిబ్బంది ఈ టెక్నాలజీ సర్వైలెన్స్ లో విధులు నిర్వహించనున్నారు. మేడారం జాతరలో చాలా పెద్ద సంఖ్యలో జనాలు వస్తారు కాబట్టి ఎక్కువ శాతం తప్పిపోయే అవకాశం ఉంటుంది.

### జియోట్యాగ్ బేస్డ్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్

దాదాపు ఈసారి మూడు కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్న క్రమంలో జాతరకు వచ్చే భక్తులు ఎవరూ తప్పిపోకుండా చర్యలను చేపడుతున్నారు. గత జాతరలో దాదాపు 30 వేల మంది వరకు తప్పిపోయిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి 'జియోట్యాగ్ బేస్డ్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్' వ్యవస్థను తీసుకు వస్తున్నారు. వొడాఫోన్-ఐడియా సహకారంతో ఈ విధానం అందుబాటులో ఉంటుంది.

### క్యూఆర్ కోడ్ గల జియో ట్యాగ్‌లతో తప్పిపోకుండా చర్యలు

పస్రా, తాడ్వాయి మార్గాల్లోని కౌంటర్లలో వృద్ధులు, పిల్లల వివరాలను నమోదు చేసి వారికి క్యూఆర్ కోడ్ గల జియోట్యాగ్‌లను కడతారు. దీంతో వారు ఎవరైనా తప్పిపోయినా ఈ ట్యాగ్ ను స్కాన్ చేయటం ద్వారా వారి పూర్తి వివరాలు తెలుస్తాయి. శబరిమలలో విజయవంతమైన ఈ విధానాన్ని ఇప్పుడు మేడారంలో అమలు చేయటానికి అధికారులు రంగం సిద్ధం చేశారు.

### శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేకంగా 12 క్రైమ్ బృందాలు

బితెలుగు, ఇంగ్లీష్‌తో పాటు హిందీ, తమిళ భాషల్లోనూ వివరాల నమోదుకు అవకాశం కల్పించారు. జాతరలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేకంగా 12 క్రైమ్ బృందాలు పనిచేస్తున్నాయి. పాత నేరస్థుల గుర్తింపునకు ఆసుపత్రి ప్రాంగణాలు, పార్కింగ్ స్థలాల వద్ద 'ఫేస్ రికగ్నిషన్' సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. అనుమానాస్పద వస్తువులను గుర్తించే రియల్-టైమ్ అలర్ట్ సిస్టమ్‌ను కూడా సిద్ధం చేశారు.

## మున్సిపల్ పోరుకు 'కమలం' సై

- కాంగ్రెస్ వైఫల్యాలే అస్త్రాలుగా బీజేపీ సమరశంఖం
- అడ్రస్ లేని గ్యారెంటీలు.. అసహనంలో సీఎం
- మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ వ్యూహరచన
- మీడియా సమావేశంలో బిజెపి నేతలు

సి కె న్యూస్ ప్రతినిధి:రాష్ట్రంలో రానున్న ప్రతిష్టాత్మక మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ తన వ్యూహాలకు పదును పెట్టింది. ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన 'మున్సిపాలిటీ ఎన్నికల విజయ సంకల్ప సమ్మేళనం' వేదికగా బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎన్నికల సమరశంఖం పూరించారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పార్టీ యంత్రాంగం సిద్ధంగా ఉందని రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, జిల్లా ఇంచార్జి బద్దం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వెయ్యికి పైగా స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా బీజేపీ తన క్షేత్రస్థాయి బలాన్ని నిరూపించుకుందని, గ్రామ పంచాయతీ ఫలితాలు కేవలం ఆరంభం మాత్రమేనని నేతలు ఉద్ఘాటించారు. రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం నుండి బీఆర్ఎస్ కనుమరుగైందని, ఆ పార్టీ త్వరలోనే ముక్కలవ్వడం ఖాయమని జోస్యం చెప్పిన నాయకులు, భవిష్యత్తులో పోటీ కేవలం కాంగ్రెస్, బీజేపీల మధ్యే ఉంటుందని తేల్చిచెప్పారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే ప్రధాన అజెండాగా ఈ సమావేశం సాగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచూ చేస్తున్న ఢిల్లీ పర్యటనలపై బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన పర్యటనలు రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదని, కేవలం తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికేనని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పంపించే యూరియాను సైతం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు బ్లాక్ మార్కెట్ చేస్తూ రైతులను ఇబ్బందుల పాలుచేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని, గత 11 ఏళ్లలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 12 లక్షల కోట్లతోనే ఇక్కడ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. రేషన్ షాపుల్లో కేంద్రం ఇచ్చే బియ్యానికి సీఎం ఫోటో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తోందన్న తప్పుడు ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, వాస్తవాలను వివరించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.




సమావేశంలో మాట్లాడిన బీజేపీ నేత పొంగులేటి రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి వైఖరిపై విరుచుకుపడ్డారు. అధికారంలోకి వచ్చేందుకు ఆనాడు ఆర్భాటంగా ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయాయని ఎద్దేవా చేశారు. రైతులకు భరోసా లేదని, యువతకు ఉపాధి, మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ముఖ్యమంత్రి బీజేపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. పాలన గాడి తప్పడంతో సీఎం రేవంత్ రెడ్డిలో అసహనం పతాక స్థాయికి చేరిందని, అందుకే సీపీఐ శతవార్షికోత్సవ వేదికను కూడా తన రాజకీయ ఆక్రోశాన్ని వెళ్లగక్కడానికి వాడుకున్నారని విమర్శించారు. ఒకప్పుడు వర్గ పోరాటాలు, సిద్ధాంతాల గురించి మాట్లాడిన కమ్యూనిస్టులు నేడు కేవలం ఉనికిని కాపాడుకోవడం కోసం దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని, వారు 'పొలిటికల్ కమర్షియల్ అవుట్‌ఫిట్లు'గా మారిపోయారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.
సర్దార్ పటేల్ లాంటి మహనీయుడిని విస్మరించిన కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. మన భవిష్యత్తు బాగుండాలన్నా, పట్టణాలు అభివృద్ధి చెందాలన్నా, పేదలకు ఇళ్లు, ఆరోగ్య భద్రత దక్కాలన్నా అది డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే సాధ్యమని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకుని కాషాయ జెండాను రెపరెపలాడించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు బిజెపి రాష్ట్ర కార్యదర్శి బద్దం మహిపాల్ రెడ్డి బిజెపి రాష్ట్ర కోశాధికారి వాసుదేవరావు మీడియా ఇంచార్జ్ డాక్టర్ నెల్లూరు బెనర్జీ పాల్గొన్నారు....

## గ్రామం లో డ్రైనేజీ కాల్వలను శుద్ధి చేయించిన సర్పంచ్



సి.కె న్యూస్, చింతకాని ప్రతినిధి:చింతకాని మండలం తిరుమలపురం గ్రామంలోని డ్రైనేజీ కాల్వలు మురుగునీటితో నిండిపోయి, దుర్వాసన వెదజల్లుతున్నాయి. దోమలు, ఈగలు, ఇతర క్రిమికీటకాలు పెరిగి, వ్యాధులు ప్రబలుతున్న పరిస్థితి నెలకొంది.
ప్రజల ఆరోగ్యం దృష్ట్యా, తక్షణమే స్పందించి, కాల్వలను శుభ్రపరిచారు. దీంతో కాలనీప్రజలు గ్రామ సర్పంచ్ ను అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులుపాల్గొన్నారు

## రాష్ట్ర ప్రభుత్వ ఛైర్మన్లను కలిసిన చిన్నమండవ గ్రామ కాంగ్రెస్ నాయకులు



సి.కె న్యూస్, చింతకాని ప్రతినిధి రాష్ట్ర ప్రభుత్వ ఛైర్మన్లను కలిసిన గ్రామ కాంగ్రెస్ నాయకులు .
ఈరోజు చింతకాని మండలంలోని కోదుమూరు వందనం ఎత్తిపోతల పథకం 2 ఫేస్ శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా శ్రీ మల్లు భట్టి విక్రమార్కగారు వచ్చినారు, వారితోపాటు వచ్చినా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరావు గారు, రాష్ట్ర హస్తకలల ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ గౌడ్, మాజీ మీూా కొండబాల కోటేశ్వరరావు, మాజీ మీూజ పొట్లా నాగేశ్వరావు, ప్రొద్దుటూరు మాజీ సర్పంచ్ పెంట్యాల పుల్లయ్య గార్లతో మర్యాదపూర్వకంగా కలిసిన చిన్నమండవ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరీదు రామకృష్ణ గౌడ్, 1వ వార్డ్ నెంబర్ శామాకూరి రామారావు, కొండమిది నాగరాజు, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి... అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి



- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్

సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జనవరి -20:ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జనవరి 26 నాడు కలెక్టర్ సందేశం తయారి నిమిత్తం ప్రతి శాఖ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి వివరాలు క్లుప్తంగా అందించాలని అన్నారు. ఏన్కూరు మండలానికి చెందిన మంగిలాల్ ఓం ఆదిత్య గాయత్రి స్కూల్ నియమాలకు వ్యతిరేకంగా నడుస్తుందని దానిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు సమర్పించగా జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక
మంగళవారం | తెలంగాణ
20 జనవరి 2026
cknews@gmail.com

Follow: @cknews

## గ్రామపాలనలో సర్పంచ్ లు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి..

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రభుత్వ పథకాలు ప్రజల గడప గడపకు చేరే విధంగా కృషి చేయాలి
- సర్పంచ్ లు బాధ్యతతో పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి బాటలో నిలుస్తాయి
- ఖమ్మం టిటిడిసి సమావేశ మందిరంలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్ లకు నిర్వహించిన శిక్షణ తరగతులలో పాల్గొని అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జనవరి – 20 :**గ్రామాభివృద్ధిలో సర్పంచ్ పదవిని ఒక హోదాగా కాకుండా బాధ్యతగా తీసుకుని, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టు కోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు.

ఖమ్మం నగరంలోని టిటిడిసీ సమావేశ మందిరం నందు జిల్లాలో నూతనంగా గెలుపొందిన గ్రామ పంచాయతీ సర్పంచులకు సోమవారం నుండి ఐదురోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులలో అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని గ్రామ పాలనలో సర్పంచ్ ల పాత్ర, బాధ్యతలు, ప్రజలకు అందించవలసిన సేవలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజల మన్ననలు పొంది సర్పంచులుగా ఎన్నికైన సందర్భంగా ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు అత్యంత పోటాపోటీగా జరిగేవని, అలాంటి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొని గెలవడం గొప్ప బాధ్యతను తెచ్చిపెడుతుందని గుర్తుచేశారు. గ్రామ పాలనలో పంచాయతీ సెక్రెటరీతో సమన్వయం చేసుకుంటూ సమర్థవంతమైన పరిపాలన అందించాలని సూచించారు.

గ్రామాలలో పారిశుధ్యంపై దృష్టి సారించాలని, ప్రతి రోజు ఉదయం ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ జరగాలని, గ్రామ ప్రజలు బయటకు వచ్చే సమయానికి ఊరంతా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వీధి దీపాల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతి కాలనీతో పాటు ప్రధాన కేంద్రాల్లో సరిపడా వీధి లైట్లు ఏర్పాటు చేసి నిర్వహణ చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పచ్చదనం పెంపొందించేందుకు నర్సరీలు అభివృద్ధి చేయాలని, ఉన్న చెట్లకు నీరు పోయడం, కొత్త మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని అన్నారు.

గ్రామ పంచాయతీకి మరింత ఆదాయం పెరిగేలా సరైన సమయంలో పన్నుల వసూలు చేపట్టాలని, తద్వారా పంచాయతీ నిధులు సమకూర్చుకోవాలని సూచించారు.

గ్రామాలలో ఉన్న మిషన్ భగీరథ ట్యాంకులను కాలానుగుణంగా శుభ్రపరిచి స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించాలని, పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా వేతనాలు సమయానికి చెల్లించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించే విషయంలో ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సర్పంచులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులుగా కాక ప్రజల సేవకులుగా పనిచేస్తే గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధ్యం అవుతుందని స్పష్టం చేశారు.

ప్రజల సమస్యలకు తక్షణ స్పందన, గ్రామాలలో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామ పంచాయతీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సర్పంచులకు సూచించారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, శిక్షణా తరగతుల పర్యవేక్షకురాలు విద్యాలత, సంబంధిత శాఖల అధికారులు, ఖమ్మం జిల్లాలో నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆత్మ గౌరవంగా జీవించేలా వడ్డీ లేని రుణాల కార్యక్రమం అమలు.....




- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మహిళలు వ్యాపారులు చేసి ఆర్థికంగా ఎదగాలి
- మహిళలకు ప్రత్యేక పారిశ్రామిక పార్క్ ఏర్పాటు
- 100 పడకల ఆసుపత్రి ప్రారంభించి, మహిళలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసిన డిప్యూటీ సీఎం

**సికె న్యూస్ ప్రతినిధి మధిర, జనవరి -20:**మహిళలు ఆత్మ గౌరవంగా జీవించేలా వడ్డీ లేని రుణాల కార్యక్రమం అమలు జరుగుతున్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క సోమవారం మధిరలో 34 కోట్లతో నూతనంగా నిర్మించిన 100 పడకల ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ప్రారంభించి, ఆసుపత్రిలోని సర్జికల్ కన్సెల్టేషన్ రూమ్, ఆర్థోపెడిక్ రిసెప్షన్ రిజిస్ట్రేషన్, శానిటేషన్ వర్క్ డిస్పెన్సరీ, క్యాజువాలిటీ డయాలసిస్ కాంప్లెక్స్, బయో మెడికల్ వేస్ట్ రూమ్, లేబర్ బ్లాక్ రూమ్స్, ఎమర్జెన్సీ వార్డు లను డిప్యూటీ సీఎం పరిశీలించి, డయాలసిస్ మెషిన్ ను ప్రారంభించారు.

అనంతరం రెడ్డి ఫంక్షన్ హాల్లో మహిళా శక్తి సభ్యులకు వడ్డీ లేని రుణాలను డిప్యూటీ సీఎం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాలలో మహిళలకు 5 వేల కోట్ల రూపాయల రుణాలను నేడు పంపిణీ చేస్తున్నామని అన్నారు. కుటుంబ అవసరాలకు, వ్యాపారాల నిమిత్తం డబ్బును వినియోగించుకునే మహిళలకు వడ్డీ లేని రుణాల కార్యక్రమం గొప్పతనం తెలుస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

స్వయం సహాయక మహిళ సంఘాలలో అధికంగా పేదలు, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు అధికంగా ఉంటారని అన్నారు. ఎస్.హెచ్.జి లు లేని పక్షంలో పిల్లల చదువులకు,అనారోగ్య సమస్యలకు, అత్యవసర పరిస్థితులకు బయట అధిక వడ్డీకి రుణాలు తీసుకునే దుస్థితి ఉండేదని, అటువంటి పరిస్థితుల నుంచి మహిళలను బయటకు తీసుకుని వచ్చేందుకు ఆనాడు వైయస్సార్ వడ్డి లేని రుణాల కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు.

మహిళలు ఆత్మ గౌరవంతో జీవించేలా స్వయం సహాయక సంఘాలు ఉపయోగ పడుతున్నాయని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో గత పాలకులు వడ్డి లేని రుణాల కార్యక్రమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చర్చించి మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కార్యక్రమాన్ని మరోసారి ప్రారంభించామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 21 వేల కోట్ల రూపాయలకు సంబంధించిన వడ్డీ లేని రుణాలు సొమ్ము మహిళా సంఘాలకు చెక్కుల ద్వారా అందించామని, నేడు పట్టణ ప్రాంతంలోని సంఘాలకు మరో 5 వేల కోట్ల రుణాలకు సంబంధించి సొమ్మును అందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

వడ్డీ లేని రుణాలతో స్వయం సహాయక మహిళా సంఘాలు వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా ఎదగాలని అన్నారు. మహిళా సంఘాలు వ్యాపారం చేయడంలో సంపూర్ణ సహకారం జిల్లా యంత్రాంగం అందించాలని, లాభదాయకమైన వ్యాపారం, మార్కెటింగ్ అవకాశాలు, ఉత్పత్తి నైపుణ్యాలు వంటి అన్ని అంశాలలో సంపూర్ణ అవగాహన కల్పించాలని అన్నారు.

ఉత్పత్తి రంగంలో మహిళలు కీలకపాత్ర పోషించాలని ప్రభుత్వం భావిస్తున్నదని, అందుకు అవసరమైన శిక్షణా కార్యక్రమాలు మధిర సెంటర్ లో ఎన్జీవోల సమన్వయంతో ఏర్పాటు చేయాలని అన్నారు. మహిళలకు ప్రత్యేకంగా చిన్న, సూక్ష్మ కుటీర పరిశ్రమల పార్క్ ఏర్పాటు చేస్తామని అన్నారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఉత్పత్తి చేసిన కరెంటు ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రభుత్వం పరంగా ఉన్న క్యాంటీన్ లను ఇందిరమ్మ క్యాంటీన్ పేరిట మహిళా సంఘాలకు అందించామని అన్నారు. ఆర్టీసీ సంస్థలో అద్దె బస్సులు కూడా మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

మధిర పట్టణంలో మహిళా సంఘాల కోసం ప్రత్యేక అధికారిని నియమించామని తెలిపారు. మధిర పట్టణంలో ప్రస్తుతం 5688 మంది మహిళలు మహిళ సంఘాలలో ఉన్నారని, మరో 5000 మంది మహిళలు స్వయం సహాయక సంఘాలలో చేరాలని, కనీసం 10 వేల మంది మహిళలతో మధిర పట్టణంలో మహిళా సంఘాలలో చేరాలని డిప్యూటీ సీఎం తెలిపారు.

గ్రామీణ ప్రాంతంలో ఉన్న మహిళా సంఘాలు అమూల్ వంటి పెద్ద సంస్థలకు ధీటుగా 40 వేల మంది మహిళలతో ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మధిర పట్టణానికి సమీపంలో అభివృద్ధి చేస్తున్న పరిశ్రమల పార్క్ లో మహిళ వ్యాపారులకు ప్రత్యేకంగా భూమి కేటాయింపు చేస్తామని అన్నారు. వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా అవసరమైన శిక్షణ, బ్యాంకుల ద్వారా రుణాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తామని అన్నారు.

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆర్టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు.

మధిర పట్టణ పరిధిలో కోటి 86 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు ప్రభుత్వం నేడు అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. వడ్డీ లేని రుణాలతో మహిళలు మంచి లాభదాయకమైన వ్యాపార యూనిట్లు స్థాపించి ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల మాదిరిగానే పట్టణ ప్రాంతాలలో కూడా వడ్డి లేని రుణాలు కార్యక్రమం అమలు అవుతుందని అన్నారు.

మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంక్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం వినూత్నమైన కార్యక్రమం చేపట్టిందని, స్వశక్తి మహిళా సంఘాల ద్వారా ఖమ్మం మహిళా మార్ట్ ఏర్పాటు చేసి నెలకు 50 వేల వరకు లాభం సంపాదిస్తున్నారని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా ప్రభుత్వ విద్యా సంస్థల నిర్వహణ, అభివృద్ధి పనులు, విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టడం మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వం చేపట్టిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్త కళల కార్పోరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహారావు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 1380 కోట్లతో 81 సోలార్ గ్రామాల ఏర్పాటుకు చర్యలు.....

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- సోలార్ రూఫ్ టాప్ ద్వారా గ్రామస్తులకు ఆదాయం
- పంట పొలాల్లో మిగిలిన గడ్డి కాల్చొద్దు
- బోనకల్ మండలంలోని రావినూతల మోడల్ సోలార్ గ్రామాన్ని ప్రారంభించి, గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం

**సికె న్యూస్ ప్రతినిధి బోనకల్, జనవరి -20 :**పైలెట్ ప్రాజెక్టు క్రింద రాష్ట్ర ప్రభుత్వం 1380 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా 81 సోలార్ గ్రామాల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకున్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం బోనకల్ మండలంలోని రావినూతల మోడల్ సోలార్ గ్రామాన్ని ఎన్.పి.డి.సి.ఎల్. సీఎండి వరుణ్ రెడ్డి, రెడ్కో సీఎండి ఏ. శరత్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి ప్రారంభించి గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి ఇంటిపై ప్రభుత్వం పూర్తి ఖర్చు భరిస్తూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసి ఉత్పన్నమైన విద్యుత్తును సొంత అవసరాలకు వినియోగించుకుంటూ, మిగిలింది గ్రిడ్ కు విక్రయించడం జరుగుతుందని అన్నారు.



రాష్ట్ర వ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టు క్రింద 1380 కోట్ల ఖర్చుతో 81 సోలార్ గ్రామాలను తీసుకోవడం జరిగిందని, ఖమ్మం జిల్లాలో 27 గ్రామాలు ఉండగా, అందులో బోనకల్ మండలంలో ఉన్న అన్ని 22 గ్రామాలను 306 కోట్లతో పైలెట్ ప్రాజెక్ట్ క్రింద ఎంపిక చేశామని అన్నారు. 24 కోట్ల రూపాయలతో రావినూతల గ్రామంలో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి సోలార్ రూఫ్ టాప్ సంవత్సరానికి 14 వేల యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని, అవసరమైన విద్యుత్ మనం వినియోగించు కొని, మిగిలినది గ్రిడ్ కు అమ్ముకుంటే ప్రభుత్వం యూనిట్ కు 2 రూపాయల 57 పైసల చొప్పున చెల్లించడం జరుగుతుందని అన్నారు. గతంలో ప్రజలు విద్యుత్ బిల్లులు చెల్లించేవారని, నేడు అదే విద్యుత్ శాఖ ప్రజలకు నగదు చెల్లించేలా పథకాన్ని రూపొందించామని అన్నారు. ఈ పథకాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని, అవసరం మేరకు మాత్రమే కరెంట్ వాడుకుంటూ మిగిలిన విద్యుత్తు అమ్మడం ద్వారా ఆదాయం పొందాలని డిప్యూటీ సీఎం సూచించారు. బోనకల్ మండలంలో ప్రతి రైతుకు వ్యవసాయ పంప్ సెట్ లు కూడా సోలార్ ద్వారా నడిచేలా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పంట ఉత్పత్తితో పాటు విద్యుత్ ఉత్పత్తి ద్వారా కూడా రైతులు ఆదాయం పొందేలా చర్యలు చేపట్టామని అన్నారు. సోలార్ పంప్ సెట్ ను షెడ్ లా కూడా ఉపయోగ పడుతుందని అన్నారు. పంట పొలాల్లో మిగిలిపోయిన గడ్డిని కాల్చి వేయడం వల్ల పర్యావరణం కలుషితం అవుతుందని, రైతులు ఎవరు దయచేసి పొలాలకు నిప్పు పెట్టవద్దని డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు. పర్యావరణ కాలుష్యం వల్ల మన జీవనానికి ప్రమాదం ఏర్పడుతుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్త కళల కార్పోరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## లక్షా 98 వేల ఎకరాల అదనపు ఆయకట్టు సాధనకు ప్రణాళికలు.....

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ప్రజా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి 74 వేల 163 కోట్ల రూపాయలు ఖర్చు చేశాం
- పేదల సంక్షేమానికి 47 వేల 710 కోట్లు ఖర్చు
- చింతకాని మండలం వందనం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం

**సికె న్యూస్ ప్రతినిధి చింతకాని, జనవరి -20**

ఖమ్మం జిల్లాలో లక్షా 98 వేల ఎకరాల అదనపు ఆయకట్టు సాధనకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క సోమవారం చింతకాని మండలం వందనం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్ లతో కలిసి శంకుస్థాపన చేశారు.2500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు 35 కోట్ల 75 లక్షలతో చేపట్టిన కొదుమూరు-వందనం ఎత్తిపోతల రెండవ విడత పనులకు, వందనం గ్రామంలో ఎస్సి కాలనీలో కోటి 85 లక్షలతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్ల పనులకు, ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి వందనం పుట్టకోట జెడ్పీ రోడ్డు వరకు 3 కోట్ల 50 లక్షలతో చేపట్టనున్న బీ.టి రోడ్డు నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ కొదుమూరు - వందనం లిఫ్ట్ పనులు గతంలో పూర్తి చేసి 2500 ఎకరాలకు 2013 ప్రాంతంలో సాగు నీరు అందించామని అన్నారు. చింతకాని మండలం చుట్టు నాగార్జున సాగర్ నీళ్ళు ఉన్నప్పటికి కొదుమూరు, వందనం రైతులు సాగు నీరు అందక ఇబ్బందులు పడ్డారని, వీరి ఆవేదన పరిశీలించి 2009 లో ఇచ్చిన మాట ప్రకారం అప్పట్లో మొదటి విడత లిఫ్ట్ పూర్తి చేశామని అన్నారు.కొదుమూరు వందనం లిఫ్ట్ కారణంగా ఎండాకాలంలో కూడా నీరు అందుబాటులో ఉంటుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరో 2,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు కొదుమూరు వందనం లిఫ్ట్ రెండవ ఫేజ్ కు శ్రీకారం చుట్టామని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరిట గత పాలకులు పేద ప్రజలను మోసం చేశారని, ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు నిర్వహించిన పాద యాత్రలో ప్రతి గ్రామంలో ప్రజలు ఇండ్ల కోసం తాపత్రయం పడటం గమనించి అధికారంలోకి రాగానే 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను 22 వేల 500 కోట్ల రూపాయలతో మంజూరు చేసామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని, ప్రతి వారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపులు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. జిల్లాలో 2 లక్షల 79 వేల ఎకరాల ఆయకట్టు ఉమ్మడి రాష్ట్రంలో కల్పించామని అన్నారు. ప్రజా ప్రభుత్వం నేడు మరో లక్షా 98 వేల ఎకరాల అదనపు ఆయకట్టు సాధించేందుకు ప్రణాళికలు తయారు చేశామని అన్నారు. మున్నేరు పాలేరు లింకు కెనాల్ ద్వారా లక్షా 38 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, జవహర్ లిఫ్ట్ క్రింద 33 వేల 25 ఎకరాలు, రాజీవ్ ఫీడర్ కెనాల్ ద్వారా 23 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, కొదుమూరు వందనం లిఫ్ట్ ద్వారా 2500 ఎకరాలు, మంచుకొండ లిఫ్ట్ ద్వారా 2412 ఎకరాల ఆయకట్టుకు నీళ్ళు అందించే పనులు చేపట్టామని అన్నారు.నేడు రైతులకు మేలు చేసేందుకు మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు, వ్యవసాయానికి 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్, సన్న వడ్లకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్, రైతు భరోసా, రైతు బీమా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగంపై గత 2 సంవత్సరాల కాలంలో ప్రజా ప్రభుత్వం 74 వేల 163 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసిందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, చేయూత ఫించన్, వడ్డీ లేని రుణాలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, గృహ జ్యోతి, సన్న బియ్యం వంటి వివిధ సంక్షేమ పథకాలకు 47 వేల 710 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని అన్నారు. ప్రపంచంతో పోటీ పడేలా మన విద్యార్థులు చదువుకోవాలని 100 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు మంజూరు చేశామని, మధిర లో 25 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, రాబోయే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మధిర అసెంబ్లీ 5 మండలాల పరిధిలో కట్టలేరు, మున్నేరు, వైరా నది జలాలు వృథాగా పోకుండా ఆనకట్టలు కట్టిస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రజల స్థితిగతులు మెరుగవ్వాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో మహిళలకు 5 వేల కోట్ల రూపాయలు వడ్డి లేని రుణాలు ప్రభుత్వం అందజేస్తున్నదని అన్నారు. మహిళలు ఆత్మగౌరవంతో ఉండే విధంగా ఇందిరమ్మ చీరలను ప్రత్యేకంగా డిజైన్ చేయించి ఇంటింటికీ పంపిణీ చేశామని అన్నారు. 96 లక్షల కుటుంబాలకు రేషన్ షాపుల ద్వారా ప్రతి సభ్యుడికి ఉచితంగా నెలకు 6 కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకు ఎటువంటి రాబందులు, గద్దలు ప్రజా సొమ్ము కాజేయకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి 35 కోట్ల వ్యయంతో కొదుమూరు-వందనం ఎత్తిపోతల రెండవ విడత పనులకు నేడు శంకుస్థాపన చేసుకున్నామని,



ఈ ప్రాజెక్టు పూర్తి చేయడం వల్ల 2500 ఎకరాల ఆయకట్టుకు అదనంగా సాగునీరు అందుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టును అతి తక్కువ కరెంటు ఖర్చుతో గ్రావిటీ ద్వారా అధికంగా పొలాలకు సాగునీరు అందేలా డిజైన్ చేశామని, ఈ ప్రాజెక్టు కొదుమూరు గ్రామ రైతులకు బాగా ఉపయోగపడుతుందని అన్నారు. కొదుమూరు వందనం ఎత్తిపోతల పథకం రెండవ విడత పనులు త్వరగా పూర్తయ్యే విధంగా ఇరిగేషన్ అధికారులు మానిటరింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు సంక్షేమంలో భాగంగా పెద్ద ఎత్తున ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ డబ్బులు రైతుల ఖాతాలో జమ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్త కళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఇరిగేషన్ ఈఎన్సి రమేష్, ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఏఎంసి చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, సిపిఓ ఏ శ్రీనివాస్, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి నవీన్ బాబు, జిల్లా మైనారిటీ అధికారి ముజాహిద్, వందనం సర్పంచ్ ఆవుల నాగేశ్వర రావు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కెరియర్ ఉన్నతికి తీరైన మనోవైఖరి



కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగం అనగానే ఆకర్షణీయమైన వేతన ప్యాకేజీలు, సమాజంలో గౌరవం, తక్కువ వ్యవధిలోనే ఉన్నత స్థాయికి చేరుకోవడం మనసుకు స్ఫురిస్తాయి. అయితే విద్యార్థి దశ నుంచి కార్పొరేట్ కార్యాలయాల్లో అడుగుపెట్టిన యువ ఉద్యోగుల్లో ఎక్కువ మంది మేనేజ్‌మెంట్ అంచనాలను అర్థం చేసుకోలేకపోతున్నారు. కనిపించని కార్పొరేట్ పాలిటిక్స్‌ను ఎదుర్కోలేక పోతున్నారు. విమర్శలను వ్యక్తిగతంగా తీసుకుని, ఆత్మ గౌరవానికి భంగం కలిగిందని నిరాశకు లోనవుతున్నారు. ఈ పరిణామాలన్నీ పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. కార్పొరేట్ ఉద్యోగాల్లో విజయం సాధించి, ఉన్నత స్థాయికి చేరుకోవడంలో సాంకేతిక నైపుణ్యాలతో పాటు మనోవైఖరి (ఆటిట్యూడ్) కీలక పాత్ర పోషిస్తుంది. బృంద సమావేశాల్లో టీమ్ లీడర్ విమర్శించినా, సామర్థ్యాన్ని తక్కువ చేసి మాట్లాడినట్లు అనిపించినా కలత చెందకూడదు. వాటిని తుది తీర్పుగా కాకుండా, మెరుగుపడటానికి ఇచ్చే విలువైన సూచనలుగా తీసుకునే మనోవైఖరిని అలవరచుకోవాలి. ఇలాంటి దృక్పథం ఉన్న ఉద్యోగులే దీర్ఘ కాలంలో విజయం సాధించగలరు. అకడమిక్ మార్కులు, సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ లాంటి అదనపు నైపుణ్యాలు కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాన్ని పొందగలిగేలా చేస్తాయి. కానీ ఆ కొలువులో విజయం సాధించి, నాయకత్వ స్థాయికి చేరుకోవడంలో మనోవైఖరి కీలక పాత్ర పోషిస్తుంది. సరైన ఆలోచనా విధానాన్ని అలవరచుకోవడం, సవాళ్లను అవకాశాలుగా మలచుకోవడం పనితీరులో భాగం కావాలి.

### ప్రతికూల స్పందన

ఒక తయారీ సంస్థ నిర్వహించే ప్రాంగణ నియామకాలకు రజిత పీజీ విద్యార్హతతో హాజరైంది. స్పష్టమైన సమాధానాలతో ఆకట్టుకుని సెలక్షన్ జాబితాలో స్థానం పొందింది. ఇంటర్వ్యూలో భాగంగా చదివిన కాలేజీ, ఇంటర్న్‌షిప్ చేసిన సంస్థల్లో గమనించిన, నేర్చుకున్న అంశాలపై అభిప్రాయాన్ని అడిగారు. దీనికి సమాధానంగా కాలేజీలో ప్రొఫెసర్లు సబ్జెక్టు సరిగా బోధించలేదని, కష్టపడి స్వయంగా నేర్చుకున్నానని చెప్పింది. ఇంటర్న్‌షిప్ చేసిన సంస్థలో గ్రూప్ రాజకీయాలున్నాయంది. ఈ వ్యాఖ్యలతో ఇంటర్వ్యూ ప్యానల్‌కు రజిత అభ్యర్థిత్వంపై అనుమానాలు కలిగాయి. ఫలితంగా అప్పటివరకూ అనుకూలంగా ఉన్న నిర్ణయం ఒక్కసారిగా మారిపోయింది.

గతంలో పనిచేసిన సంస్థలు, అధికారులపై ప్రతికూలంగా స్పందించకూడదు. రజితలా మాట్లాడితే తమ యాజమాన్యంపైనా అదే ధోరణి భవిష్యత్తులో కొనసాగించవచ్చన్న ఆందోళన ఇంటర్వ్యూ ప్యానెల్‌కు కలుగుతుంది. ఇలాంటి మనోవైఖరి ఉన్నవారిని సంస్థ వాతావరణానికి సరిపోరని భావిస్తారు. వారి అభ్యర్థిత్వాన్ని తిరస్కరిస్తారు.

ఉద్యోగ నియామకాల్లో ధ్రువపత్రాలు, నైపుణ్యాలు పరిశీలించి ఎంపిక చేసుకున్నప్పటికీ, సంస్థలో ఆ ఉద్యోగి ఎదిగే సామర్థ్యాన్ని నిర్ధారించేది అభ్యర్థి మనోవైఖరే.

### సానుకూల మనోవైఖరి

ఉద్యోగంలో తొలిసారి చేరిన యువతరానికి సాంకేతిక నైపుణ్యాలు, ఆశావహ దృక్పథంతో పాటు సమస్యా పరిష్కార మార్గాలను సూచించే మనోవైఖరి ఉండాలని యాజమాన్యాలు భావిస్తాయి. పేరున్న బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ చదివిన అనిల్, సునీతలు వినియోగ వస్తువుల మార్కెటింగ్ సంస్థలో సేల్స్ ట్రెయినీలుగా చేరారు. మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి సమాచారం సేకరించి, త్రైమాసిక విక్రయ ప్రణాళిక తయారుచేయడం వీరి ప్రధాన బాధ్యత. కాలపరిమితి దగ్గర పడుతున్నా టీమ్ లీడర్‌కు అవసరమైన సమాచారం పూర్తిగా అందలేదు. సమీక్షా సమావేశంలో సమయానికి సమాచారం ఇవ్వలేదని మార్కెటింగ్ టీమ్‌ను అనిల్ నిందించాడు. అయితే సునీత మాత్రం భిన్నమైన దృక్పథం ప్రదర్శించింది. సమాచారం పూర్తిగా లేనప్పటికీ, స్వయంగా మార్కెటింగ్ టీమ్‌ను సంప్రదించి వీలైనంత ఎక్కువ సమాచారం సేకరించి ఉండాల్సిందని, ఈ విషయంలో సీనియర్స్ మార్గదర్శకత్వం తీసుకోకుండా తప్పు చేశానని సంజాయిషీ ఇచ్చింది.

అనిల్ తన నిర్లక్ష్య వైఖరి వల్ల క్లయింట్‌కు నిర్దేశిత కాల పరిమితిలో అవసరమైన సమాచారం ఇవ్వలేకపోయాడు. దీంతో యాజమాన్య ప్రతిష్ఠకు భంగం కలిగింది. ఫలితంగా ఉద్యోగుల వార్షిక పనితీరు మదింపులో అతడికి తక్కువ రేటింగ్ ఇచ్చి, టీమ్ నుంచి తప్పించారు.

ఉన్నత లక్ష్యాలు, ఆశయాలతో కార్పొరేట్ సంస్థల్లో అడుగుపెట్టే యువ ఉద్యోగార్థులు సరైన మనోవైఖరి (ఆటిట్యూడ్) లేకపోవడంతో కెరియర్‌లో విఫలమవుతుంటారు.

### పరిధి దాటి బాధ్యత

కార్పొరేట్ సంస్థల్లో కొన్ని సార్లు ఎవరూ ఏ పనినీ ప్రత్యేకంగా చెప్పకపోవచ్చు. అయినప్పటికీ ఆ బాధ్యత తీసుకోవాలి. సంస్థ ప్రయోజనాలు కాపాడాలి. సమస్యకు సరైన పరిష్కార మార్గాలు చూపగల లక్షణాలు ఉద్యోగి మనోవైఖరిని ప్రతిబింబిస్తాయి. ఇవి అభ్యర్థి రెజ్యూమెలో స్పష్టంగా కనిపించవు, కానీ ఇవే ఉద్యోగి కెరియర్ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. రాజేష్, రఘురాం ఇద్దరూ ఒక తయారీ రంగ సంస్థలో ట్రెయినీ అధికారులుగా చేరారు. రాజేష్ ఆఫీస్ సమయాలను కచ్చితంగా పాటించేవాడు. జాబ్ డిస్క్రిప్షన్‌లో పేర్కొన్న పనులు తేడా లేకుండా పూర్తిచేసేవాడు. ఎక్కడా ప్రతికూల విమర్శలకు తావిచ్చేవాడు కాదు. దీంతో అతడు పరిమితులకు లోబడి పనిచేసే ఉద్యోగిగా పేరు తెచ్చుకున్నాడు. అంతకు మించి పనిచేయడు, అదనంగా ఎలాంటి బాధ్యతలూ తీసుకోడు. రఘురాం మాత్రం అవసరం ఉన్నప్పుడు ఆఫీస్ సమయాలు దాటిన తర్వాతా పని చేసేవాడు. పని పూర్తయిన తర్వాత టీమ్ లీడర్‌ను సంప్రదించి, అదనంగా చేయగల పనులు ఏమైనా ఉన్నాయా? అని అడిగేవాడు. బృంద సమస్యలు తెలుసుకుని, సాధ్యమైన పరిష్కార మార్గాలను చూపేవాడు. సమస్య ఎవరిదైనప్పటికీ ఇది సంస్థ సమస్య అన్న మనోవైఖరితో
పనిచేసేవాడు. దీంతో కాలక్రమంలో అందరి అభిమానాన్నీ, మేనేజ్‌మెంట్ నమ్మకాన్నీ పొంది ఉన్నత స్థాయికి ఎదిగాడు.

# సిరుల అన్నం..మిల్లెట్స్ ప్రస్తావన వచ్చినప్పుడు ఎక్స్‌పర్ట్స్ చెప్పే మాటలివె



"సూపర్ ఫుడ్, వండర్ గ్రెయిన్".. మిల్లెట్స్ ప్రస్తావన వచ్చినప్పుడు ఎక్స్‌పర్ట్స్ చెప్పే మాటలివి. "హై కార్బ్, మూడు పూటలా తింటే వెరీ డేంజర్".. ఇవి అన్నం ప్రస్తావన వచ్చినప్పుడు చెప్పే మాటలు. అయినా.. జనాలు అన్నమే ఎందుకు తింటున్నరు అంటే దీనికి చాలా కారణాలు ఉన్నయ్. హరిత విప్లవం నుంచి ప్రభుత్వ విధానాల వరకు అన్ని అన్నానికే ఓటేశాయ్?. ఇప్పుడు 'యూ' టర్న్ తీసుకుని మళ్లీ పాత పద్ధతులే మేలు అంటున్నరు ఎక్స్?పర్ట్స్?. ఒకప్పుడు పేదల ఆకలిని తీర్చిన ఈ చిరు ధాన్యాలు ఇప్పుడు వాళ్లకే దూరమైనయ్?. అందుకే వాటిని మళ్లీ అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని ఐక్యరాజ్య సమితితోపాటు చాలా దేశాలు ప్రయత్నిస్తున్నయ్?. అందులో భాగంగానే అందరూ మధ్యాహ్న భోజనంగా మిల్లెట్స్? తీసుకోవాలని మన ప్రధాని నరేంద్ర మోడీ కూడా చెప్తున్నరు.

పల్లెల్లో పెద్దవాళ్లు "పండుగలు, పబ్బాలకే తెల్లన్నం తినేటోళ్లం. మిగతా రోజుల్లో తైద అంబలి, జొన్న రొట్టెలు, సామల అన్నమే దిక్కు" అని చెప్తుంటారు. తర్వాత ఆ పరిస్థితి నుంచి.. రోజూ అన్నం తిని ఎప్పుడో ఒకసారి మిల్లెట్స్? తినే పరిస్థితికి వచ్చారు. కానీ.. ఇప్పుడు మళ్లీ పాత అలవాట్లే మంచివని, మిల్లెట్స్? తినాలని న్యూట్రిషనిస్ట్?లు చెప్తున్నారు. అంతెందుకు మన ప్రధానితోపాటు ఐక్యరాజ్య సమితి కూడా 'చిరు ధాన్యాలతోనే ఆరోగ్య సిరి' అంటోంది. అసలు మిల్లెట్స్?లో ఏముంది? నిజంగానే వాటిని తినాల్సిన అవసరం ఉందా? అన్నీ తెలిసినా అన్నమే ఎందుకు తింటున్నారు?

### ఎన్విరాన్‌మెంట్‌కు మంచిది

మిల్లెట్స్? సాగు మనకే కాదు.. ఎన్విరాన్?మెంట్?కు కూడా మేలు చేస్తుందని సైంటిస్ట్?లు అంటున్నారు. "ఇప్పుడు తింటున్న ధాన్యాల దిగుబడిని పెంచడం, వాటిని చీడల నుంచి తట్టుకునే విధంగా డెవలప్? చేయడం కంటే.. వాటితోపాటు చిరు ధాన్యాలను పండించి, తినడం మంచిద"ని చెప్తున్నారు. అలా చేయడం ఎన్విరాన్?మెంట్?కు కూడా మంచిదని నిరూపించారు. 2019లో ఇండియాలో కొంత విస్తీర్ణంలో వరి సాగుకు బదులు మిల్లెట్స్? (సజ్జలు, జొన్నలు లాంటివి) వేసి, పరిశీలించారు. అప్పుడు సైంటిస్ట్?లు ఈ పంటలు వరితో పోలిస్తే తక్కువ గ్రీన్?హౌజ్? గ్యాస్?ను విడుదల చేస్తాయని, వాతావరణంలో మార్పులు రాకుండా కాపాడేందుకు ఈ పంటలు ఉపయోగపడతాయని తెలుసుకున్నారు. వరితో పోలిస్తే.. నీళ్లు, శ్రామిక శక్తి కూడా తక్కువ అవసరం అవుతాయని చెప్పారు. ఈ పంటలు పండడానికి సింథటిక్ ఎరువులు, పురుగు మందులు అవసరం లేదు. కాబట్టి కెమికల్? ఫ్రీ. దాదాపు అన్ని రకాల మిల్లెట్స్?కి పైపొర చాలా గట్టిగా ఉంటుంది. ఇవి చాలా చిన్న సైజ్?లో ఉంటాయి. అందుకే కరువు, తెగుళ్లను, వాతావరణ పరిస్థితులను తట్టుకుంటాయి.

### ఎక్కడైనా పండుతాయి

వరి, గోధుమలతో పోలిస్తే తక్కువ టైంలో పండుతాయి. చాలా రకాల మిల్లెట్స్ 70%--%100 రోజుల్లో పండుతాయి. కానీ.. వరి, గోధుమలు పండడానికి 120%--%-150 రోజులు పడుతుంది. అంతేకాదు వరి, గోధుమలతో పోలిస్తే వీటిని పండించడానికి నీళ్ల అవసరం తక్కువే. మిల్లెట్స్? పండడానికి తక్కువలో తక్కువ 350%--%500 మిల్లీమీటర్లు వర్షపాతం అవసరం. అదే వరి, గోధుమలకు అయితే 600-%--%1,200 మిల్లీమీటర్ల వర్షం కావాలి. అంటే తక్కువ వర్షపాతం ఉండే ప్రాంతాల్లో కూడా మిల్లెట్స్? పండుతాయి. కొండ ప్రాంతాల్లో కూడా పండించొచ్చు.

కర్నాటకలోని తుంకూరుకు 70 కి.మీ దూరంలో సిరా అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో హొండూరే గ్రామం ఉంది. ఆ గ్రామంలో కోరలె రఘు అనే రైతు ప్రతి ఏడాది వానాకాలంలో మొక్కజొన్న పండిస్తుంటాడు. ఆ ప్రాంతంలో నీటికి చాలా కరువు ఉంటుంది. ఎక్కువమంది వర్షం మీద ఆధారపడి సాగు చేస్తుంటారు. ప్రతిసారి సరిగ్గా వర్షాలు పడకపోవడంతో పంటలు సరిగా పండేవి కాదు. దాంతో కొన్నేండ్ల క్రితం రఘు అండు కొర్రల సాగు మొదలుపెట్టాడు. అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. వర్షాలు పెద్దగా పడకపోయినా మంచి దిగుబడి వస్తోంది. 2011లో మొదటిసారి ఎనిమిదిన్నర ఎకరాల్లో అండు కొర్రలు సాగు చేశాడు. అప్పుడు 80 క్వింటాళ్ల దిగుబడిని సాధించాడు. ఆ తర్వాత దిగుబడి మరింత పెరిగింది. పంటలో కొంత భాగం తోటి రైతులకు విత్తనాల కోసం అమ్ముతున్నాడు. మిగతా పంటను మార్కెట్?లో అమ్ముతున్నాడు. రఘును చూసి ఎంతోమంది రైతులు నీళు ‿న్నా కూడా మిల్లెట్స్? సాగు చేయడానికే ఇష్టపడుతున్నారు. హొండూరేలో ఇప్పుడు చాలామంది రైతులు అండు కొర్రలు పండిస్తున్నారు.

### ప్రపంచవ్యాప్తంగా డిమాండ్

కొన్నేండ్ల నుంచి ప్రపంచవ్యాప్తంగా మిల్లెట్స్?కి డిమాండ్? ఏర్పడింది. అందులోనూ కరోనా తర్వాత డిమాండ్? మరింత పెరిగింది. కానీ.. డిమాండ్?కు సరిపడా ప్రొడక్షన్? లేకపోవడంతో కొన్ని రకాల మిల్లెట్స్? ధరలు పెరుగుతున్నాయి. అందుకే ఈ వెలితిని భర్తీ చేసేందుకు యూఎన్?వోతో పాటు చాలా దేశాలు పనిచేస్తున్నాయి. మిల్లెట్? సాగు విస్తీర్ణం, ప్రొడక్షన్?లో మన దేశానికి 19 శాతం గ్లోబల్? షేర్ ? ఉన్నప్పటికీ దేశంలోని మొత్తం ఆహార ఉత్పత్తిలో అది చాలా తక్కువ. ప్రపంచంలో ఎక్కువగా సహార చుట్టు పక్కల ఉన్న ఆఫ్రికన్? దేశాల్లో, ఆసియా అంతటా ఉన్న చిన్న కమతాల రైతులే వీటిని పండిస్తున్నారు. ఈ పంటలు ఫుడ్?, పశువుల మేత, బయో ఫ్యుయెల్స్?ని అందిస్తున్నాయి. ప్రస్తుతం మన దేశం ఏటా దాదాపు 170 లక్షల టన్నుల మిల్లెట్స్?ని ఉత్పత్తి చేస్తుంది. 2017%--%-18 నుండి 2020%--%-21 సంవత్సరాల్లో సగటున 11 శాతం విస్తీర్ణంలోనే మిల్లెట్స్? పండిస్తున్నారు. ఇది మొత్తం ఆహార ఉత్పత్తుల్లో కేవలం 6 శాతం మాత్రమే. అయినా.. ఆసియాలోని మిల్లెట్స్ ప్రొడక్షన్?లో? 80 శాతం ఇండియాదే. అందులోనూ రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, హర్యానా, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్నాయి. మన దేశం 2021-22లో 34.32 మిలియన్ యూఎస్ డాలర్ల విలువైన మిల్లెట్స్?ని ఎగుమతి చేసింది. 2020 - 21లో 26.97 మిలియన్ డాలర్లు, 2019 -20లో 28.5 మిలియన్ డాలర్ల విలువైన మిల్లెట్స్? ఎగుమతి చేసింది. ఇండియా నుంచి ఎక్కువగా యూఏఈ, నేపాల్, సౌదీ అరేబియా, లిబియా, ఒమన్, ఈజిప్ట్, ట్యునీషియా, యెమెన్, యూకే, అమెరికాలు దిగుమతి చేసుకుంటున్నాయి. అయితే.. ఇండోనేసియా, బెల్జియం, జపాన్, జర్మనీ, మెక్సికో, ఇటలీ, యూఎస్, ఇంగ్లాండ్, బ్రెజిల్, నెదర్లాండ్స్ దేశాలు ఇతర దేశాల నుంచి మిల్లెట్స్‌ని ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నాయి.

### అందానికి కూడా..

మిల్లెట్స్‌లో విటమిన్ -సి, ఇ ఉంటాయి. ఇవి నేచురల్ సన్‌స్క్రీన్‌లుగా పనిచేస్తాయి. ఎండవల్ల స్కిన్ దెబ్బతినకుండా, డల్‌గా, డార్క్‌గా మారకుండా కాపాడతాయి. కొత్త స్కిన్ సెల్స్ పుట్టేందుకు సాయం చేస్తాయి. అంతేకాదు.. మిల్లెట్స్ స్కిన్‌ని ఎప్పుడు హైడ్రేటెడ్‌గా ఉంచుతాయి. పొడిబారకుండా కాపాడతాయి. యాంటీ ఏజింగ్‌కు కూడా బాగా పనికొస్తాయి. వయసు మీద పడిందనడానికి సూచనలు.. నల్ల మచ్చలు, మొటిమలు, ముడతలు. అవి రాకుండా మిల్లెట్స్ స్కిన్‌ని కాపాడతాయి. రోజూ మిల్లెట్స్ తింటే జుట్టుకు కూడా బలం. జుట్టు రాలే సమస్య తగ్గుతుంది. ఇవి తలపై బ్లడ్ సర్క్యులేషన్‌ని పెంచుతాయి. దాని వల్ల జుట్టు వేగంగా పెరుగుతుంది.

### కొన్నేండ్ల నుంచి..

ఇప్పటికే కొన్నేండ్ల నుంచి మిల్లెట్స్?కు డిమాండ్? పెరుగుతూ వస్తోంది. కాకపోతే.. ఇదివరకు పల్లెల్లో ప్రజలే ఎక్కువగా వీటిని తినేవాళ్లు. ఇప్పుడు సిటీల్లో ఉండే ప్రజలు తినడానికి ఇష్టపడుతున్నారు. ఎందుకంటే.. ఇదివరకు ఇవి బియ్యం కంటే తక్కువ ధరకు దొరికేవి. కానీ.. ఇప్పుడు సాగు విస్తీర్ణం తగ్గడం వల్ల దాదాపు చాలా రకాల మిల్లెట్స్? బియ్యం కంటే చాలా ఎక్కువ రేటు ఉన్నాయి. అందుకే ఆదాయం ఎక్కువగా ఉన్నవాళ్లే వీటిని తింటున్నారు. సాగు విస్తీర్ణం పెరిగి, ప్రొడక్షన్? పెరిగితే.. బియ్యం కంటే తక్కువ ధరకు దొరికే అవకాశం ఉంది. గతంతో పోలిస్తే వీటికి మార్కెట్ కూడా బాగానే ఉంది. కొన్ని కంపెనీలు ఇప్పుడు ట్రెండ్? ఫాలో అవుతూ... రకరకాలుగా మార్కెట్ చేస్తున్నారు. ఉదాహరణకు బాజ్రా ఫ్లేక్స్, జొవార్ ఫ్లేక్స్, జొన్న పిండితో చేసిన పాన్‌కేక్ మిక్స్, రాగి, జోవర్ దోస మిక్స్, రాగితో చేసిన డెజర్ట్ మిక్స్ లాంటివి మార్కెట్?లో ఉన్నాయి. అందులోనూ కొన్ని బ్రాండ్‌లు "క్లీన్ లేబుల్ సర్టిఫికెట్", "వంద శాతం హోల్‌గ్రెయిన్ సర్టిఫికెట్" తీసుకుని ప్రొడక్ట్స్‌ని మార్కెట్‌లోకి తెస్తున్నాయి.

### లాభాలెన్నో..

ప్రకృతి మనకు ప్రసాదించిన గొప్ప కానుకలు మిల్లెట్స్?. కానీ.. మనలో చాలామంది వాటిని పట్టించుకోవడంలేదు. అవి మన బాడీకి అనేక రకాల రోగాలను ఎదుర్కోవడంలో సాయం చేస్తాయి.

### అవసరమా?

మిల్లెట్స్? సాగును పెంచాల్సిన అవసరం ప్రపంచానికి ఎంతగానో ఉంది. ఎందుకంటే.. కొన్నేండ్ల నుంచి ప్రకృతి విపత్తులు ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. గ్లోబల్? వార్మింగ్?, పెరుగుతున్న నీటి కొరత, తక్కువ సాగు భూమి, ఎక్కువ జనాభా లాంటి ప్రస్తుత పరిస్థితుల్లో ఇండియా... మిల్లెట్స్? సాగు తప్పనిసరిగా చేయాలని చెప్తున్నారు సైంటిస్ట్?లు. పైగా మన జనాభాలో 14 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఈ సమస్యను తీర్చే శక్తి మిల్లెట్స్?కు ఉందని ఎక్స్?పర్ట్స్? చెప్తున్నారు. మిల్లెట్స్? తినడం ఇండియన్స్?కి కొత్తేమీ కాదు. హరిత విప్లవానికి ముందు అందరూ ఇవే తిన్నారు. పైగా వీటితో అనేక రకాల సంప్రదాయ వంటకాలు చేసుకోవచ్చు. అంతెందుకు వీటితో రెడీ టు కుక్?, రెడీ టు ఈట్? ఫుడ్స్? కూడా అందుబాటులోకి తీసుకురావొచ్చు.

### మన దగ్గర పండించేవి...

ప్రపంచవ్యాప్తంగా ప్రాంతీయంగా పండే అనేక రకాల మిల్లెట్స్ ఉన్నాయి. మన దగ్గర మాత్రం ఎక్కువగా జొన్నలు (జొవార్), సజ్జలు (పెర్ల్ మిల్లెట్), రాగులు(ఫింగర్ మిల్లెట్), లిటిల్ మిల్లెట్ (చామలు), ఫాక్స్‌టైల్ మిల్లెట్ (కొర్రలు), ప్రోసో మిల్లెట్ (వరిగెలు), బార్న్యార్డ్ మిల్లెట్ (ఊదలు), కోడో మిల్లెట్(అరికలు) పండిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్?లో వీటి రేట్లు కూడా ఎక్కువగానే ఉన్నాయి. జొన్నలు, సజ్జలు, రాగుల రేట్లు కూడా పెరుగుతూ వస్తున్నాయి. 2017 - 18లో జొన్నల కనీస మద్దతు రేటు 1,725 రూపాయలు ఉండేది. 2022 - 23కి 2,990 రూపాయలకు పెరిగింది. అలాగే సజ్జల రేటు 1,425 నుంచి 2,350కి, రాగుల రేటు 1,900 నుంచి 3,578కి పెరిగాయి.

### మిల్లెట్ మిషన్

మిల్లెట్స్ సాగు విస్తీర్ణం, వినియోగం పెంచాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తోంది. అందులో భాగంగానే మిల్లెట్స్ సాగును ప్రోత్సహిస్తోంది. మిల్లెట్స్? ప్రమోషన్ కోసం దేశంలోని కొన్ని సిటీల్లో మిల్లెట్ ఎక్స్‌పోలను ఏర్పాటు చేస్తున్నారు. తంజావూరులో ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ మిల్లెట్ ప్రాసెసింగ్ (ఐఎస్ఎంపీ)ని ఏర్పాటు చేసే ఆలోచన కూడా ఉంది. మిల్లెట్ మిషన్‌లో భాగంగా ఇండియాని గ్లోబల్ మిల్లెట్స్ హబ్‌గా మార్చాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. అంతేకాదు.. గతేడాది డిసెంబర్‌లో పార్లమెంట్‌లోని అఖిల పక్ష ఎంపీలకు మిల్లెట్స్ ఫుడ్‌తో లంచ్ ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జరిగే జీ%--% 20 సదస్సులో కూడా అన్ని రకాల ఫుడ్ వెరైటీలను మిల్లెట్స్?తోనే వండుతామని కేంద్ర మంత్రి జై శంకర్? చెప్పారు.

### బడ్జెట్‌లో

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2023%--%24 వార్షిక బడ్జెట్ ప్రసంగంలో ముఖ్యంగా వ్యవసాయం, రైతుల కోసం కొన్ని పథకాలను ప్రస్తావించారు. అందులో దేశ వ్యాప్తంగా రైతులను ఎట్రాక్ట్ చేసిన పథకం 'శ్రీ అన్న యోజన'. మిల్లెట్స్ సాగు విస్తీర్ణం, వాడకాన్ని ప్రోత్సహించేందుకు ఈ స్కీంని తీసుకొచ్చారు. ప్రసంగంలో మిల్లెట్స్‌ని 'శ్రీ అన్న' అన్నారు. అలా పలకడం వెనక ఉన్న కారణాన్ని తర్వాత మోదీ కర్నాటకలో ఒక బహిరంగ ర్యాలీలో చెప్పారు. కర్నాటకతోపాటు సౌత్ ఇండియాలోని కొన్ని ప్రాంతాల్లో మిల్లెట్స్?ని 'సిరి ధాన్యం' అని పిలుస్తారు. దాన్ని వ్యవహారికంలో 'శ్రీ ధాన్యం' కూడా అంటారు. అందుకే మిల్లెట్స్?ని 'శ్రీ అన్న' అని పిలుస్తున్నారు. అంతేకాదు 'శ్రీ అన్న' అంటే అన్ని ఆహార ధాన్యాల్లో అత్యుత్తమమైనది అనే అర్థం కూడా ఉందన్నారు. మిల్లెట్స్? రుచిగా ఉండడంతో పాటు వాటిలో పోషకాలు పుష్కలంగా ఉండడం వల్ల కర్ణాటకలో 'శ్రీ ధాన్యం' అని పిలుస్తున్నారని వ్యవసాయ నిపుణులు అంటున్నారు.

### ఎన్నికల మేనిఫెస్టోలో

సెంట్రల్? గవర్నమెంట్ మిల్లెట్ మిషన్ తీసుకొచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మిల్లెట్స్ సాగు, వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాయి. కర్నాటకలో ఈ మధ్య జరిగిన ఎన్నికలప్పుడు బీజేపీ పార్టీ తన మేనిఫెస్టో విడుదల చేసింది. అందులో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతి కుటుంబానికి ప్రతి నెలా 5 కిలోల బియ్యంతో పాటు 5 కిలోల మిల్లెట్స్? అందిస్తామని చెప్పారు.

### సాయుధ బలగాలకు మిల్లెట్స్

కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సెంట్రల్ ఆర్మ్‌డ్‌పోలీస్ ఫోర్స్), జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్)కు పెట్టే భోజనంలో 30శాతం మిల్లెట్స్ అందించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ మధ్యే నిర్ణయం తీసుకుంది. అందుకోసం మిల్లెట్ బేస్‌డ్ మెనూను రెడీ చేయాలని బలగాలకు చెప్పింది.

### యూపీలో ప్రత్యేక పథకం

ఉత్తరప్రదేశ్ గవర్నమెంట్ కూడా మిల్లెట్స్‌ని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ఒక పథకాన్ని తీసుకొచ్చింది. "ఉత్తరప్రదేశ్ మిల్లెట్స్ రివైవల్ ప్రోగ్రామ్"లో భాగంగా రాష్ట్రంలోని 75 జిల్లాల్లో రైతులకు ప్రతి సంవత్సరం మిల్లెట్స్? విత్తనాల మినీ కిట్‌ను ఫ్రీగా ఇస్తారు. ఈ ఏడాది మొదలైన ఈ పథకం నాలుగేండ్ల వరకు కొనసాగుతుంది. అంతేకాకుండా ప్రాసెసింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తారు.

CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక
మంగళవారం | తెలంగాణ
20 జనవరి 2026
cknews@gmail.com

Follow:
@cknews

# బ్యాక్ టూ బ్యాక్ రిలీజ్ లతో ఆ బ్యూటీ!



సక్సెస్ ఒక్కోసారి ఆలస్యం కావొచ్చు. కానీ సాలిడ్ సక్సెస్ అందుకుంటే? కెరీర్ ఒక్కసారిగా టర్నింగ్ తిరిగిపోతుంది. ఇక్కడ ఆవగింజంత అదృష్టం కూడా కలిసి రావాలండోయ్. తెలుగు అమ్మాయి నయన్ సారిక జర్నీ అలాగే కని పిస్తుంది. %-%గమ్ గమ్ గణేషా%-%తో టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన బ్యూటీకి ఆ సినిమా ఆశించిన ఫలితాన్నివ్వలేదు. అదే ఏడాది రిలీజ్ అయిన %-%ఆయ్%-% తో మాత్రం మంచి సక్సెస్ అందుకుంది. యూత్ ఫుల్ స్టోరీతో అమ్మడు యువతకు బాగానే కనెక్ట్ అయింది. ఆ సినిమా సక్సస్ అనంతరం %-%క%-% తో ఏకంగా బ్లాక్ బస్టర్ ఖాతాలో వేసుకుంది.ఇందులో హీరో కిరణ్ అబ్బవరంకి జోడీగా సత్యభామ అనే పల్లెటూరి యువతి పాత్రలో ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. లవ్ సీన్స్ లో హీరోతో కెమిస్ట్రీ చక్కగా వర్కౌట్ చేసింది. లుక్స్, క్యూట్ ఎక్స్ ప్రెషన్స్, యాక్టింగ్, డ్యాన్స్ అన్ని పర్ఫెక్ట్ గా కుదిరాయి. ఆ తర్వాత %-%బెంచ్ లైఫ్%-% అనే మరో సినిమా చేసింది. కానీ ఈ సినిమా మాత్రం ఎప్పుడు రిలీజ్ అయిందో కూడా తెలియదు. ఇవన్నీ 2024లో రిలీజ్ అయిన చిత్రాలు. 2025లో మాత్రం ఒక్క సినిమా కూడా రిలీజ్ చేయలేదు. కానీ 2026 లో మాత్రం రెండు సంవత్సరాలకు తగ్గ ఎంటర్ టైన్ మెంట్ ను అందించే కాన్ఫిడెన్స్ తో దిగుతుంది.ప్రస్తుతం శ్రీ విష్ణు హీరోగా నటిస్తోన్న %-%విష్ణు విన్యాసం%-%లో నటిస్తోంది. సెట్స్ లో ఉందీ చిత్రం. అన్ని పనులు పూర్తి చేసుకుని ఫిబ్రవరిలో రిలీజ్ చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అలాగే మరో యువ హీరో సంగీత్ శోభన్ హీరోగా నటిస్తోన్న మరో చిత్రంలోనూ హీరోయిన్ గా ఎంపికైంది. నిహారిక కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ప్రస్తుతం ఆన్ సెట్స్ లో ఉన్న సినిమా వచ్చే ఏడాది రిలీజ్ అవుతుంది. కన్నడ నటుడు గోల్డెన్ స్టార్ గణేష్ హీరోగా నటిస్తోన్న చిత్రంలోనూ నయన్ సారిక నాయికగా ఎంపికైంది. %-%పినాక%-% టైటిల్ తో రూపొందుతున్న చిత్రమిది. ఈ చిత్రాన్ని పాన్ ఇండియాలో రిలీజ్ చేస్తున్నారు. రిలీజ్ అనంతరం ప్రేక్షకులకు కనెక్ట్ అయితే గనుక సారిక ఇమేజ్ పాన్ ఇండియాకు రీచ్ అవుతుంది. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. ఇవన్నీ 2026లో రిలీజ్ అయ్యే ప్రాజెక్టులే. ఇవిగాక మరికొన్ని ప్రాజెక్ట్ లకు సైన్ చేసింది. కానీ వాటి వివరాలు మాత్రం గోప్యంగా ఉంచింది. ఎంతో మంది తెలుగు అమ్మాయిలున్నా? వాళ్లెవ్వరికీ రాని అవకాశాలు నయన్ అందుకోవడంలో లక్కీ గాళ్ అనే మరోసారి ప్రూవ్ అయింది.

## రితికా నాయక్ మెజెంటా చీర మీరు చూడాల్సిందే



## శార్వరి తెల్లటి రంగులో వేడిని పెంచింది, ఇంటర్నెట్ దూరంగా కనిపించదు





# రాజాసాబ్ బ్యూటీ వీపందం

క్యూట్ లుక్స్, చిక్లెట్ చిక్స్‌తో కుర్రకారు గుండెల్లో గుబులు పెంచుతోంది ఈ బ్యూటీ. రాజాసాబ్ చిత్రంతో తన లక్ చెక్ చేసుకునేందుకు సిద్ధమవుతున్న ఈ క్యూట్ బ్యూటీ పేరు రిద్ధి కుమార్. చెన్నై కి చెందిన ఈ క్యూటీ ఇంతకుముందు - లవర్ - అనే చిత్రంతో తెరకు పరిచయమైంది. ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ ప్రభాస్ సినిమాల్లో అవకాశాలు అందుకుంటోంది. ప్రస్తుతం - రాజాసాబ్ - తన కెరీర్‌కి బిగ్ బ్రేక్ నిస్తుందని రిద్ధి కుమార్ ఆశిస్తోంది. ఇటీవలి - రాజా సాబ్ - కి సోషల్ మీడియాలలో ప్రచారం కల్పిస్తూ, రిద్ధి రెచ్చిపోతోంది. ముఖ్యంగా తన స్వస్థలం చెన్నైలో రాజా సాబ్ కి బోలెడంత హైప్ క్రియేట్ చేస్తోంది. ఇంతకుముందు పాటల ఆవిష్కరణ కార్యక్రమంలో రిద్ధి సందడి చాలా హుషారెత్తించింది. వేదికపై ఎందరు ఉన్నా రిద్ధి ముందు నిలబడలేకపోయారంటే తన సందడి ఏ రేంజులో ఆకర్షించిందో అర్థం చేసుకోవచ్చు. రిద్ధి కుమార్ ఇటీవల సోషల్ మీడియా సంచలనంగా అందరి హృదయాల్లో నిలిచి ఉంది. తనకు విపరీతమైన హైప్ లేకపోయినా కానీ, తన లుక్స్, గట్స్ తో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారుతోంది.

ముఖ్యంగా -రాధే శ్యామ్ - తర్వాత ప్రభాస్‌తో రెండోసారి కలిసి నటిస్తోంది. ఇది తనకు స్వస్థలం చెన్నైలోను క్రేజ్ పెంచుతోంది. భారతదేశంలోని బిగ్గెస్ట్ పాన్ ఇండియన్ స్టార్ సరసన రిద్ధి కపూర్ ఆవకాశాలు అందుకుంటోంది. రాజా సాబ్‌లో మెయిన్ స్ట్రీమ్ నాయికలుగా మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ నటించినా కానీ, రిద్ధి కూడా ప్రభావవంతమైన పాత్రతో ఆకట్టుకోనుందని తెలిసింది.తాజాగా రిద్ధి బ్యాక్ లెస్ ఫోజ్ తో గుబులు పెంచుతోంది. డార్క్ నేవీ బ్లూ ఫ్రాక్ ధరించిన రిద్ధి కుమార్ చురుకైన చూపులతో గుండె గుల్ల చేస్తోంది. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా దూసుకెళుతోంది. ఒక్కో సినిమాతో గ్లామర్ ప్రపంచంలో తన కెరీర్ రన్ ని మెరుగుపరు చుకోవాలని ప్రయత్నిస్తున్న ఈ చెన్నై చంద్రానికి ఆల్ ది బెస్ట్ చెబుతోంది తెలుగు యూత్.